శనివారం
19-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 59
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైనా-దక్షిణాఫ్రికా స్నేహానికి, సహకారానికి తోడ్పడండి

'చైనా, దక్షిణాఫ్రికా మధ్య స్నేహం, సహకార బంధాన్ని మరింత పెంపొందించేందుకు మీ వంతు తోడ్పాటు అందించండి' అని దక్షిణాఫ్రికా, దర్బన్ వర్సిటీలోని కన్ఫూషియస్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు, ఫ్యాకల్టీని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కోరారు. చైనా భాష నేర్చుకోవాలని వారిని ప్రోత్సహించారు.

2 లో

తిరుగుబాటు మొదలైందా?

- అధికార పార్టీని వీడుతున్న కీలక నేతలు
- గన్నవరంలో వైసీపీకి షాకిచ్చిన యార్లగడ్డ
- టీడీపీలో చేరే అవకాశం
- పెరుగుతున్న అసంతృప్తి
- నిఘాతో ఎమ్మెల్యేల సతమతం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసీపీలో ముసలం ప్రారంభమైంది. కీలక నేతలు ఒక్కొరొక్కరూ పార్టీకి దూరమవుతున్నారు. మరో తొమ్మిది నెలల్లో ఎన్నికలు రానుండటంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ వ్యూహాల్ని ప్రారంభించాయి. గత ఎన్నికల్లో ఓటమి పాలైన నియోజకవర్గాలపై అధికార వైసీపీ దృష్టిసారించగా, టీడీపీ కంచుకోటలుగా ఉన్న నియోజకవర్గాలను తిరిగి దక్కించుకునేందుకు టీడీపీ ముమ్మర ప్రయత్నాల్ని ప్రారంభించింది. దీంతో సీఎం జగన్ తనదైన శైలిలో సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాల కొనసాగింపు, బటన్ నొక్కే కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతిపక్ష టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభల ద్వారా, ఆయన తనయుడు లోకేశ్ పాదయాత్ర ద్వారా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టారు. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ వారాహి వాహనంపై విడతల వారీగా పర్యటనలు చేపడుతున్నారు. తమకు సంస్థాగతంగా ఎంతో బలముందని చెప్పుకుంటున్న వైసీపీకి ఇప్పుడు వరుసగా షాక్‌లు ఎదురవుతున్నాయి. నాడు పార్టీ బలోపేతం కోసం ఎంతో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లేకపోవడం,

- మిగతా 2 లో

వీరు పెద్దలు కాదు...
పారిశ్రామికవేత్తలు

- రాజ్యసభలో 12 శాతం ఎంపీలు బిలియనీర్లే
- 18 మంది తెలుగు ఎంపీల ఆస్తులు రూ.9,419 కోట్లు
- ఏడీఆర్ నివేదిక వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజా సమస్యలు చర్చించాల్సిన పెద్దల సభలో బడావ్యాపారులు ఆశీనులవుతున్నారు. ఈ ప్రక్రియ ప్రారంభమై చాలా రోజులవుతున్నప్పటికీ క్రమేపీ వ్యాపారస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, అన్నింటికీ మించి పేద ప్రజల సమస్యలు, వారి సంక్షేమమే లక్ష్యంగా చర్చలు చేయాల్సిన పెద్దల సభ...వందల, వేల కోట్లకు అధిపతులైన బడా పారిశ్రామికవేత్తలకు వేదికగా మారుతోంది. తాజాగా ఏడీఆర్ సంస్థ వెల్లడించిన నివేదిక ప్రజాస్వామ్యవాదుల్లో ఆందోళన కలిగిస్తోంది. రాజ్యసభకు ఎన్నికైన మొత్తం పార్లమెంటు సభ్యుల్లో 12 శాతం మంది బిలియనీర్లు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యూ) అనే సంస్థతో కలిసి ఏడీఆర్...రాజ్యసభలోని మొత్తం 225 మంది సభ్యులపై ఉన్న నేరాలు, ఆస్తుల వివరాలతో నివేదికను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఈ జాబితాలో 18 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ.9,419 కోట్లు ఉన్నట్లు పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని 11 మందిలో ఐదుగురు, తెలంగాణలోని ఏడుగురు ఎంపీల్లో ముగ్గురున్నారు. వీరిలో ఏపీతో పోలిస్తే తెలంగాణ ఎంపీల ఆస్తుల విలువే ఎక్కువగా

- మిగతా 2 లో

విక్రమ్ తీసిన
చంద్రుడి తొలి చిత్రాలు

- విజయవంతంగా డీబూస్టింగ్
- వేగం తగ్గించుకున్న ల్యాండర్: ఇస్రో

బెంగళూరు: చంద్రుడిపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయాణం సాఫీగా సాగుతోంది. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయి చంద్రుడి కక్ష్యలో సొంతంగా తిరిగడం మొదలు పెట్టిన కొద్దిసేపటికే 'విక్రమ్' ల్యాండర్ చంద్రుడి ఫొటోలను తీసింది. వీటిని ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ఇస్రో శుక్రవారం విడుదల చేసింది. ఆ చిత్రంలో చంద్రుడి ఉపరితలంపై బిలాలు కనిపిస్తుండగా, వాటి పేర్లను ఇస్రో వెల్లడించింది. ఫ్యాబ్రీ, గియార్డనో బ్రునో, హర్కేబి జే తదితరాల ఫొటోలను ల్యాండర్ ఇమేజర్ (ఎల్) కెమెరా-1 తీసింది. చంద్రుడిపై అతిపెద్ద బిలాల్లో ఒకటిగా గియార్డనో బ్రునో ఉండగా హర్కేబి జే బిలం దాదాపు 43 కిమీలు ఉంది. డీబూస్టింగ్ (వేగాన్ని తగ్గించే ప్రక్రియ) శుక్రవారం

- మిగతా 2 లో

మావోయిస్టు అగ్రనేత
రాజిరెడ్డి మృతి?

రాయ్‌పూర్: మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి(70) అలియాస్ సాయన్న కన్నుమూసినట్లు తెలుస్తోంది. అనారోగ్య కారణాలతో ఆయన మరణించినట్లు సమాచారం. రాజిరెడ్డి మృతిపై ఇప్పటివరకు మావోయిస్టు పార్టీ ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే ఈ మృతిని చత్తీస్‌గఢ్ పోలీసులు ధ్రువీకరించారు. మల్లా రాజిరెడ్డి స్వస్థలం పెద్దపెల్లి జిల్లా మంథని మండలం ఎగ్లాస్‌పూర్ పరిధిలోని శాస్త్రులపల్లి. మల్లారెడ్డి చత్తీస్‌గఢ్, ఒడిశా దండకారణ్యంలో కీలకంగా

- మిగతా 2 లో

నిరుద్యోగమే అతిపెద్ద సమస్య

- దేశాన్ని పీడిస్తున్న పేదరికం, ద్రవ్యోల్బణం
- లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: దేశాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్యల్లో నిరుద్యోగం, పేదరికం, ద్రవ్యోల్బణం ఉన్నాయని ఓ సర్వేలో వెల్లడైంది. భారత్‌లో నిరుద్యోగం తారాస్థాయికి చేరింది. పేదరికం పెరిగింది. ద్రవ్యోల్బణం దిగిరాలేదు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిత్యావసరాల ధరల నియంత్రణ, ఉద్యోగావకాశాల కల్పన, ఖాళీల భర్తీ వంటివి కంటితుడుపు చర్యలుగా మారాయి. ఆదాయం తగ్గడం, ఖర్చు పెరగడంతో పేదరికంలోకి నెట్టబడుతున్న వారి సంఖ్య పెరిగింది. కేంద్రప్రభుత్వ తప్పిదాలు, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధానాలు దేశాన్ని ఆర్థిక మందగమనంలోకి నెట్టేశాయి. ప్రజా ప్రయోజనాలు పణంగా కార్పొరేట్లకు ఊడిగం చేసే వైఖరి సామాన్యులకు గుదిబండగా మారింది. ఈ పరిస్థితుల్లో దేశ యువత ఆలోచనలకు లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే అద్దంపట్టింది. తమను పీడిస్తున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగమని ఎక్కువ మంది చెప్పినట్లు తెలిపింది. పురుషుల్లో 40శాతం మంది, మహిళల్లో 31శాతం మంది నిరుద్యోగులు ఉన్నట్లు తేల్చింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతకు పేదరికం, అధిక ధరలు పెద్ద సమస్యలని వెల్లడించింది. నిరుద్యోగమే అతిపెద్ద సమస్య అని చెప్పిన వారిలో 15-34 ఏళ్ల మధ్య వయస్కులు 36శాతం మంది ఉన్నట్లు సర్వే నివేదిక పేర్కొంది. నిరుద్యోగమే అతిపెద్ద సమస్య అని చెప్పేవారి సంఖ్య 2016తో పోల్చితే 18శాతం పెరిగినట్లు సర్వే పేర్కొంది. పేదరికమే అతిపెద్ద సమస్య అని ఆరుగురిలో ఒకరు చెప్పగా, 13శాతం మంది ద్రవ్యోల్బణం అని. అవినీతని ఆరుశాతం మంది, విద్య, అధిక జనాభా అని నాలుగు శాతం మంది చెప్పారని తెలిపింది. అన్ని వర్గాలు ముఖ్యంగా మధ్యతరగతి

- మిగతా 2 లో

ఆదాయం పెరిగిందట!

మధ్యతరగతిపై ఎస్‌బీఐ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో మధ్యతరగతి ప్రజల ఆదాయం గత పదేళ్లలో మూడు రెట్లు పెరిగిందని భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) సర్వేలో వెల్లడైంది. 2012-13లో రూ.4.4 లక్షలుగా ఉన్న సగటు ఆదాయం 2021-22లో రూ.13 లక్షలకు చేరినట్లు తెలిపింది. 2047 నాటికి మధ్యతరగతి ప్రజల సగటు ఆదాయం సంవత్సరానికి రూ.49.70 లక్షలకు పెరగవచ్చునని అంచనా వేసింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షల కన్నా తక్కువ ఉన్నవారి జాబితా నుంచి ఐటీఆర్ దాఖలు చేసేవారిలో 25 శాతం మంది 2046-47నాటికి వైదొలగుతారని పేర్కొంది.

జీరో ట్యాక్స్ లయబిలిటీతో దాఖలయ్యే ఐటీఆర్‌ల సంఖ్య తగ్గుతుండటం సానుకూల ధోరణి అని 'డెసిఫరింగ్ ఎమెర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఐటీఆర్ ఫైలింగ్' పేరిట వెలువడిన నివేదిక వెల్లడించింది. 2010-11లో 1.60 కోట్ల మంది ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేశారని, వీరిలో 84 శాతం మంది రూ.5లక్షల ఆదాయం ఉన్నవారి జాబితాలో ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరానికి 6.85 కోట్ల మంది ఐటీఆర్‌లను దాఖలు చేశారని, వీరిలో 64 శాతం మంది మాత్రమే రూ.5 లక్షల లోపు ఆదాయ వర్గంలో ఉన్నారని చెప్పింది.

దీనినిబట్టి పదేళ్లలో దేశ జనాభాలో 13.6 శాతం మంది తక్కువ ఆదాయ వర్గం నుంచి అధిక ఆదాయ వర్గంలోకి చేరారని స్పష్టమవుతోందని తెలిపింది. జీరో ట్యాక్స్ సంబంధిత ఐటీఆర్‌లు 2010-11లో 84.1 శాతంగా ఉంటే 2021-22లో 64 శాతానికి చేరినట్లు నివేదిక పేర్కొంది. 2022-23లో 53 కోట్ల మంది ఉద్యోగులు ఉంటే 2046-47 నాటికి ఈ సంఖ్య 72.5 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది.

ఇదీ లోకం!

హుర్రే మీక్కావలసింది నాకర్ధమైపోయింది, ఇసుక ర్యాంపు, వెంటనే ఖాళీ చేసేయండి!

భారీ వర్ష సూచన

- వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాయువ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడినందున... ఆ ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి 21 వరకు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. సముద్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రం

- మిగతా 2 లో

జగన్ ప్రజల రక్తం పీల్చే జలగ

అమలాపురంలో చంద్రబాబు ధ్వజం

విశాలాంధ్ర-అమలాపురం : రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల రక్తం పీల్చే జలగ అని, అతను మళ్లీ అధికారంలోకి వస్తే మీ బతుకులు అధోగతేనని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దోచుకునే ముఖ్యమంత్రి జగన్... అధికారంలోకి రావడం కోసం తల్లి, చెల్లిని కూడా ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. 'భవిష్యత్తు గ్యారంటీ' యాత్రలో భాగంగా కోనసీమ జిల్లాలో శుక్రవారం మూడవ రోజు చంద్రబాబు పర్యటించారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా దోచేసిన జగన్ సామాన్యుడిని బతకలేని స్థాయికి దిగజార్చడని ధ్వజమెత్తారు. రుషికొండను దోచేశారు. తిరుపతి కొండను అపవిత్రం చేశారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వ నాశనం చేశారని ఆరోపించారు. మరోసారి జగన్‌కి అవకాశం వస్తే ప్రతిదానికి పన్ను వేసి పన్నులతో ప్రజలను బాదుతాడని తెలిపారు. 'దేశంలోనే ధనిక సీఎం... ఈ సైకో జగన్. ఆయన రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ గడ్డ. ఈ క్యాన్సర్ గడ్డను వదిలించుకోవల్సిన అవసరం అందరిపై ఉంది. ప్రజలు ఏమారితే రాష్ట్రమే నాశనమైపోతుంది. వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఇసుకాసురులు ఎక్కువయ్యారు. తిరుమలలో పులులుంటే భక్తులకు కర్రలు ఇస్తామంటున్నారు. కర్ర ఉంటే పులి పారిపోతుందా? ఇంటికో కర్ర పెట్టుకుని ముందుగా ఈ వైసీపీ దొంగలను తరిమికొట్టాలి. కేసులు మాఫీ చేసే వారి కోసం ఎంపీ సీటును సీఎం జగన్ అమ్ముకున్నాడు. కేంద్రం మెడలు వంచుతామని చెప్పి మెడలు దించారు. పోలవరం నిధుల కోసం ఎప్పుడైనా మాట్లాడారా? కడప స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వచ్చిందా? పార్లమెంటులో ఒక్కసారైనా వైసీపీ ఎంపీలు ప్రజా సమస్యలపై మాట్లాడారా?, బాబాయి హత్య కేసులో తమ్ముడిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడు. హత్యా రాజకీయాలు నాకు చేత కాదు. అవి నా వారసత్వం కాదు. పవన్ కళ్యాణ్ నిజాలు మాట్లాడితే ఆయన పైనా విరుచుకుపడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ రాస్తే మీడియాపై దాడులు చేస్తున్నారు. ఎవ్వరూ వాస్తవాలు

- మిగతా 2 లో

మళ్లీ
కోవిడ్ పంజా

- అమెరికా, డెన్మార్క్, ఇజ్రాయిల్‌లో బీఏ 2.86 కేసులు
- 51దేశాల్లో 'ఎరిస్' గుర్తింపు
- అప్రమత్తతతోనే రక్షణ : డబ్ల్యూహెచ్ఓ

2లో

కోవిడ్ మరోమారు పంజా విసురుతోంది. కొత్త వేరియంట్ల రూపేణ ప్రపంచంపై దాడి మొదలు పెట్టింది. ఇప్పటికే అమెరికా, డెన్మార్క్, ఇజ్రాయిల్‌లో బీఏ.2.86 వేరియంట్ కలవరం సృష్టిస్తోంది. ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి.

ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం

రష్యా, ఇరాన్ సంకల్పం

బ్రిక్స్ సభ్యత్వంపై పుతిన్, రైసీ టెలిఫోన్ చర్చలు

మాస్కో: తమ మధ్య ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని రష్యా, ఇరాన్ సంకల్పించాయి. వాణిజ్యం, రవాణా, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించాయి. అదే సమయంలో అంతర్జాతీయ, ప్రాంతీయ, పరస్పరం ప్రయోజనాత్మకమైన అనేక అంశాలపై నిశితంగా చర్చించాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ శుక్రవారం టెలిఫోన్ ద్వారా చర్చించినట్లు క్రెమిన్ వర్గాలు టెలిగ్రామ్‌లో పేర్కొన్నాయి. అంతర్జాతీయ సహకారం, ప్రాదేశిక వ్యవహారాలూ చర్చకు వచ్చాయని, షాంఘై సహకార సంఘం (ఎస్‌సీఓ)లో ఇరాన్‌కు సభ్యత్వంపైనా ఇద్దరు నాయకులు చర్చించినట్లు వెల్లడించాయి. టెహ్రాన్, మాస్కో సంబంధాలపై పుతిన్, రైసీ సంతృప్తిగా ఉన్నట్లు తెలిపాయి. వాణిజ్యం, ఇంధనం, రవాణా, పర్యావరణం, లాజిస్టిక్స్ రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంపొందించుకోవాలని ఇద్దరు అధినేతలు నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. చివర్లో షా చెరాఘ్ మసీదుపై దాడికిగాను ఇరాన్‌కు పుతిన్ సానుభూతి తెలిపారని వెల్లడించాయి. కాగా, దక్షిణాఫ్రికాలోని జొహానెస్‌బర్గ్‌లో 15వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఈనెల 22, 23, 24 తేదీల్లో జరగబోతోంది. క్యూబా, ఇరాన్, వెనిజులా, ఇండోనేసియా, వియత్నాం, నైజీరియా, మొరొక్కో, అల్జీరియా, బొలీవియా, థాయిలాండ్ దేశాలు బ్రిక్స్‌లో చేరేందుకు ప్రతిపాదనలు పంపాయి. ఈ సంఘాన్ని విస్తరించడంపై జొహానెస్‌బర్గ్ సదస్సులో విస్తృతంగా చర్చలు జరగబోతున్నాయి.

హాజరుకానున్న జిన్‌పింగ్

బీజింగ్: బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు కానున్నారు. పశ్చిమ దేశాలు, రష్యా, చైనా మధ్య దౌత్యపర అంశాలపై చర్చలు, ఖనిజాలపై పోటీ, ఉక్రెయిన్‌లో యుద్ధంతో ఏర్పడిన అంతర్జాతీయ విభజనల నేపథ్యంలో జిన్‌పింగ్ దక్షిణాఫ్రికా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చేవారం దక్షిణాఫ్రికాలో జిన్‌పింగ్ పర్యటిస్తారని ఆ దేశ విదేశాంగ శాఖ శుక్రవారం ఓ ప్రకటన చేసింది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా ఆహ్వానం మేరకు ఆ దేశంలో జరగబోయే బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ హాజరవుతున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా ఛున్‌యింగ్ వెల్లడించారు. జిన్‌పింగ్‌కు ఈ ఏడాదిలో ఇది రెండవ అంతర్జాతీయ పర్యటన కాగా మార్చిలో ఆయన రష్యా వెళ్లారు.

చైనా-దక్షిణాఫ్రికా స్నేహానికి, సహకారానికి తోడ్పడండి

'కన్ఫూషియస్' విద్యార్థులు, అధ్యాపకులతో జిన్‌పింగ్

బీజింగ్: 'చైనా, దక్షిణాఫ్రికా మధ్య స్నేహం, సహకార బంధాన్ని మరింత పెంపొందించేందుకు మీ వంతు తోడ్పాటు అందించండి' అని దక్షిణాఫ్రికా, దర్బన్ వర్సిటీలోని కన్ఫూషియస్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు, ఫ్యాకల్టీని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కోరారు. చైనా భాష నేర్చుకోవాలని వారిని ప్రోత్సహించారు. కన్ఫూషియస్ ఇనిస్టిట్యూట్ సేవలను కొనియాడారు. ఈ వ్యవస్థ పదేళ్ల కిందట ఏర్పాటు అయిందని, రెండు వర్గాల సంయుక్త చర్యలతో రాణిస్తోందని, తమ విద్య, సంస్కృతిక బంధాలకు దోహదమవుతూనే సత్ఫలితాలిస్తోందని జిన్‌పింగ్ వెల్లడించారు. ఈ ఇనిస్టిట్యూట్‌కు చెందిన 50 మంది టీచర్లు, విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ జిన్‌పింగ్‌కు లేఖ పంపారు. ఆఫ్రికా యువతకు తమ కలలను సాకారం చేసుకునే మాధ్యమాన్ని కల్పించినందుకు, ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేలా మంచి అవకాశాలు కల్పించినందుకు జిన్‌పింగ్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ లేఖకు జిన్‌పింగ్ సమాధానం పంపారు. చైనా చరిత్ర, సంస్కృతి గురించి దక్షిణాఫ్రికా యువతలో చాలా మందికి ఎంతో కొంత అవగాహన వచ్చిందని, వారికి ఉద్యోగావకాశాలు పెరిగాయని, చైనీస్ భాష నేర్చుకోవడం ద్వారా కలలను సాకారం చేసుకుంటున్నారని గ్రహించారని జిన్‌పింగ్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న చైనా, దక్షిణాఫ్రికా దేశాలు సోదరభావంతో స్నేహంగా, పరస్పర సహకారంతో, భాష, సంస్కృతులు తెలుసుకుంటూ ఐక్యంగా ముందుకెళుతున్నాయని, ఈ బంధం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు జిన్‌పింగ్ తెలిపారు. పదేళ్లలో 10వేల విద్యార్థులు శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు.

మళ్లీ కోవిడ్ పంజా

అమెరికా, డెన్మార్క్, ఇజ్రాయిల్‌లో బీఏ 2.86 కేసులు

51దేశాల్లో 'ఎరిస్' గుర్తింపు

అప్రమత్తతతోనే రక్షణ : డబ్ల్యూహెచ్‌ఓ



వాషింగ్టన్: కోవిడ్ మరోమారు పంజా విసురుతోంది. కొత్త వేరియంట్ల రూపేణ ప్రపంచంపై దాడి మొదలు పెట్టింది. ఇప్పటికే అమెరికా, డెన్మార్క్, ఇజ్రాయిల్‌లో బీఏ.2.86 వేరియంట్ కలవరం సృష్టిస్తోంది. ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. కొత్త వేరియంట్ లక్షణాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నిశితంగా గమనిస్తోంది. ఈ వేరియంట్ నుంచి మ్యుటేషన్లు ఎక్కువగా వచ్చే క్రమంలో దీనిని 'వేరియంట్ అండర్ మానిటరింగ్'గా వ్యవహరిస్తోంది. గతవారం గుర్తించిన ఈజీ.5, ఎరిస్ స్ట్రెయిన్‌ను 'వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్'గా వర్గీకరించింది. ఈ వైరస్ కేసులు ఫిబ్రవరిలో మొదట నమోదైనట్లు గుర్తించింది. అమెరికా, బ్రిటన్, చైనా, యూరప్, ఆసియాతో కలిపి 51 దేశాల్లో ఎరిస్ స్ట్రెయిన్‌ను గుర్తించినట్లు డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించింది. జులైలో కోవిడ్ కొత్త కేసులు పది లక్షలకుపైగా నమోదు కాగా 3,100 మంది చనిపోయినట్లు ఆరోగ్య సంస్థ డేటా చెబుతోంది. కోవిడ్ ముప్పు తొలగిపోలేదని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ట్రెడోస్ ఘెబ్రెయేసెస్ శుక్రవారం జీ 20 సదస్సులో నొక్కిచెప్పారు. హెల్త్ ఎమర్జెన్సీగా లేకపోయినాగానీ కోవిడ్-19 ప్రపంచ దేశాలకు ముప్పుగానే ఉందన్నారు. కొత్త వేరియంట్ బీఏ 2.86ను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని దేశాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిఘా పెంచాలని, అప్రమత్తంగా ఉండటం వల్లనే సురక్షితంగా ఉండవచ్చని నొక్కిచెప్పారు. 'పాండమిక్ అకార్డ్' (మహమ్మారి ఒప్పందం) ఖరారు ప్రక్రియ వేగవంతం కావాలని తద్వారా వచ్చే ఏడాది జరగబోయే వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో దానిని ఆమోదించేందుకు వీలు ఉంటుందని అన్ని దేశాలనుద్దేశించి అన్నారు. ఆరోగ్యాన్ని ముప్పు వాటాల్లితే ప్రతిదీ ప్రమాదంలో పడినట్టేనని కోవిడ్-19 మనకు నేర్పిందని, కఠిన పాఠాలను ప్రపంచం నేర్చుకుంటోందని ట్రెడోస్ అన్నారు. కోవిడ్ వేరియంట్లపై నిఘా పెట్టాలని, అవి ఎంతటి ప్రభావాన్ని చూపగలవో ఇంకా తెలియలేదని, అంతా అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ దేశాలకు ఆయన సూచించారు.

పాక్ ప్రధాని ప్రత్యేక సలహాదారుల్లో యాసిన్ మాలిక్ భార్య

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధాని అన్వారుల్ హక్ కాకర్‌కు ప్రత్యేక సలహాదారునిగా కశ్మీర్ వేర్పాటువాద నేత యాసిన్ మాలిక్ భార్య ముషాల్ హుస్సేన్ మాలిక్ నియమితులయ్యారు. ప్రధాని ప్రత్యేక సలహాదారులు (ఎస్ఏపీఎం) ఐదుగురి జాబితాలో ఆమె పేరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముషాల్ మానవహక్కులు, మహిళా సాధికారతపై ప్రధానికి ప్రత్యేక సలహాదారుగా నియమితులయ్యారు. జవాద్ సోహ్రాబ్ మాలిక్ విదేశీ పాకిస్తానీల కోసం ప్రత్యేక సలహాదారుగా నియమితులు కాగా, సముద్ర వ్యవహారాల సలహాదారుగా వైస్ అడ్మిరల్ (రిటైర్డ్) ఇఫ్తికార్, పర్యాటకానికి రచయిత వాసిహ్ షా, విద్య, వృత్తిశిక్షణ సలహాదారుగా సయ్యద్ ఆరిఫ్ జెహ్రా నియమితులయ్యారు. ప్రత్యేక సలహాదారు హోదా జూనియర్ మంత్రి కంటే తక్కువ అయినప్పటికీ కీలక సమస్యలపై వీరు ప్రధానికి సహాయం అందిస్తారు.

మరో హెల్త్ ఎమర్జెనీ రాకుండా చూద్దాం : మోదీ

న్యూఢిల్లీ: దేశంలో మరో 'హెల్త్ ఎమర్జెన్సీ' రాకుండా నివారించేందుకు, ఒక వేళ వస్తే ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు. సాంకేతికత లభ్యతను సులభతరం చేయడం ద్వారా 'గ్లోబల్ సౌత్' దేశాల్లోని ఆరోగ్య సేవల్లో అంతరాన్ని పూడ్చేందుకు వీలు కలుగుతుందన్నారు. 'నిక్షయ్ మిత్ర' కార్యక్రమం కింద భారత్‌లో దాదాపు 10 లక్షల మంది క్షయ రోగులను పౌరులు దత్తత తీసుకున్నారని చెప్పారు. నిర్దేశిత 2030 లక్ష్యానికి ముందే క్షయ వ్యాధి నిర్మూలన దిశగా భారత్ సాగుతున్నట్లు మోదీ వెల్లడించారు. గుజరాత్‌లో జీ 20 ఆరోగ్యశాఖ మంత్రుల సమావేశంలో మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రసంగించారు. ఆరోగ్య రంగంలో సాంకేతికత లభ్యతను అందరికి సులభతరం చేసేలా చొరవ చూపాలని జీ 20 సభ్యదేశాలకు పిలుపునిచ్చారు. 'ఆరోగ్య రంగంలో అంతర్జాతీయ స్థాయి చొరవ... మనందరి ప్రయత్నాలకు ఒక ఉమ్మడి వేదికగా నిలుస్తుంది. డిజిటల్ విధానాలు, ఆవిష్కరణలు ఇందుకు తోడ్పడతాయి. ప్రజాప్రయోజనాల కోసం ఆవిష్కరణలకు ముందుకు రావాలి. ఒకే పనికి వేర్వేరుగా నిధుల వినియోగాన్ని నివారించేందుకు సహకరించాలి' అని మోదీ అన్నారు.

వరదల బీభత్సం... పిడుగుల ప్రతాపం

దేశంలో ఇప్పటికే 2 వేల మంది మృత్యువాత

రానున్న రోజుల్లో భారీ వర్షాలకు అవకాశం

న్యూఢిల్లీ : దేశంలో రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత భారీ వర్షాలతో వరదల బీభత్సం, పిడుగుల ప్రతాపం వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇప్పటి వరకు 2 వేల మంది మృత్యువాత పడ్డారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మరింత కుండపోత వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సేకరించిన సమాచారం ప్రకారం, జూన్ ప్రారంభంలో రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 500,000 హెక్టార్ల (1.24 మిలియన్ ఎకరాలు) పంటలను వర్షాలు ప్రభావితం చేశాయి. దాదాపు 90 వేల ఇళ్లు దెబ్బతిన్నాయి. దాదాపు 60 వేల జంతువులు కూడా చనిపోయాయని గణాంకాలు చెబుతున్నాయి. జూన్-సెప్టెంబరు రుతుపవనాలు దేశంలోని సగానికి సగం వ్యవసాయ భూమికి నీరందించడం భారతదేశ ఆహారోత్పత్తి, ఆర్థిక వృద్ధికి చాలా ముఖ్యమైనది. కానీ విస్తృతమైన నష్టం, విధ్వంసం కూడా కలిగిస్తుంది. వాతావరణ మార్పు వార్షిక వాతావరణ నమూనాను మరింత అస్థిరంగా మారుస్తోందని, వరదలు, కరువులు రెండింటినీ పెంచే అవకాశం ఉందని వాతావరణ కార్యాలయం పేర్కొంది. విపరీత వాతావరణం గత సంవత్సరం గోదుమ పంటను దెబ్బతీసింది. 2023-24లో చక్కెర ఉత్పత్తి పైనా ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. పెరుగుతున్న ఆహార ధరలను తగ్గించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకునేందుకు ప్రేరేపించింది. 2024 ప్రారంభంలో ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం గోదుమ, బియ్యం, చక్కెర ఎగుమతులను నిలిపివేసేలా చేసింది. రాష్ట్ర నిల్వల నుంచి ధాన్యాలను విక్రయిస్తోంది. మరింత అవపాతం అక్టోబరులో పండించే వరి పంటలను కూడా ప్రభావితం చేస్తుంది. బీహార్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, మధ్య ప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాలలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదల ప్రమాదం కూడా పెరుగుతుందని భారత వాతావరణ శాఖ శుక్రవారం తెలిపింది. హిమాలయాలలోని ఉత్తర రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్ తీవ్ర ప్రతికూల వాతావరణంతో విధ్వంసాన్ని చూస్తోంది. రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి మరణాల సంఖ్య 330కి పైగా పెరిగింది. హోం మంత్రిత్వ శాఖ ప్రకారం, డ్యామ్ నిర్మాణం దెబ్బతినకుండా ఉండటానికి సోమవారం రాత్రి దాని గేట్లను తెరవడంతో 500 మంది ప్రజలు చిక్కుకుపోయారు. దీంతో వైమానిక దళ హెలికాప్టర్లు, ఆ ప్రాంతంలో పని చేస్తున్న ఇతర బృందాలు వారిని రక్షించాయి. భారత సైన్యం, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం పంజాబ్‌లోని కొన్ని వరద బాధిత గ్రామాల నుంచి గురువారం సుమారు 300 మందిని రక్షించినట్లు పీటీఐ కథనం పేర్కొంది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గత నెలలో లక్షలాది మంది ప్రజలు నివసించే దేశ రాజధాని దిల్లీ, దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని కొన్ని ప్రాంతాలు కూడా జలమయం అయ్యాయి.

మావోయిస్టు అగ్రనేత రాజిరెడ్డి మృతి?

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించారు. సంగ్రామ్, సాయన్న, మీసాల సాయన్న, అలోక్ అలియాస్ దేశ్‌పాండే, సత్తెన్న వంటి పేర్లతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనపై కోటి రూపాయల రివార్డు ఉంది. కరీంనగర్‌కు చెందిన రాజిరెడ్డి తొలితరం మావోయిస్టు నేతల్లో ఒకరు. అంచలంచెలుగా ఎదిగి కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్‌లతో కూడిన మావోయిస్టుల నైరుతి ప్రాంతీయ బ్యూరోలో విప్లవాత్మక ఉద్యమానికి ఇన్‌ఛార్జ్‌గా పని చేశారు. రాజిరెడ్డికి స్నేహలత అనే కూతురు ఉంది. తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్‌లో పనిచేస్తున్న కాలంలో ఆమెను ఉద్యమ సహచరుడు, ఓయూ ప్రొఫెసర్ కాశిం పెళ్లి చేసుకున్నారు. 1975లో మల్లా రాజిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గణపతికి సమకాలీకుడిగా ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. 2007లో కేరళలో అరెస్ట్ అయ్యారు. బెయిల్‌పై వచ్చినప్పటికీ మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు.

జగన్ ప్రజల రక్తం పీల్చే జలగ

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడకూడదని జగన్ భావిస్తున్నాడు. జగన్ మాదిరి మోసం చేయను. చెప్పిన పని చేస్తా' అని చంద్రబాబు అన్నారు. అమలాపురంలో నిర్మిస్తున్న జిల్లా ఆస్పత్రికి రూ.75 లక్షలకు ఎకరా స్థలం కొని రైతులకు రూ.50 లక్షలు ఇచ్చి మిగిలిన రూ.25 లక్షలు స్థానిక నాయకులు కొల్లగొట్టారన్నారు. టీడీపీ హయాంలో కట్టిన టిడ్కో ఇళ్లలో కూడా అవినీతి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువస్తే డ్రైవర్ల పిల్లల చదువులు బాధ్యతను తెలుగుదేశం తీసుకుంటుందని, వారు ఉత్తమ విద్యావంతులయ్యే బాధ్యత తీసుకుంటానని, అలాగే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెడతానని అన్నారు. సభలో అమలాపురం పార్లమెంటు టీడీపీ ఇన్‌ఛార్జ్ హరీష్ మాధుర్, అమలాపురం ఇన్‌ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణ బాబు, అల్లాడి సోంబాబు, పెచెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకట లక్ష్మీ, గోడిలంక సత్తిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)

అల్లకల్లోలంగా ఉంటుందని పేర్కొంది. అల్పపీడన ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో ఓ మోస్తారు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తాయని, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని... ప్రజలు, రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ కోరింది. రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అల్లూరి, పార్వతీపురం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, అనంతపురం, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇక తెలంగాణ వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో ఇప్పటికే మోస్తరు వర్షాలు కురుస్తుండగా, అల్పపీడనం ప్రభావంతో రాగల మూడు రోజుల పాటు అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. పశ్చిమ, వాయువ్య దిశల నుంచి తెలంగాణ వైపు గాలులు వీస్తుండగా.. మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.

ఇద్దరు మైనర్లను బంధించి అత్యాచారం

రాజస్తాన్‌లో దారుణం

జైపూర్: రాజస్తాన్‌లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇద్దరు మైనర్లను బందీగా చేసిన కొందరు... అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నట్టు తెలుస్తోంది. 17ఏళ్ల వయసు గల బాలిక...ఇంట్లో వాళ్లతో గొడవపడి బయటికి వచ్చేసింది. బస్టాండుకు వెళ్లి...అక్కడ మోను (19) అనే వ్యక్తిని కలిసింది. మైనర్‌ను మాటల్లోకి దింపిన మోను ఆమెకు సాయం చేస్తానని నమ్మించాడు. అనంతరం హోటల్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఎట్టకేలకు ఆ బాలిక మరుసటి రోజు హోటల్ నుంచి తప్పించుకుంది. ఇంటికి వెళ్లి...విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదేసమయంలో బాధితురాలు మరో విషయం చెప్పింది. హోటల్‌లో మరో బాలికను తాను చూసినట్టు వివరించింది.

ఆ బాలిక వివరాలు...14 ఏళ్ల బాలికకు సంబంధించిన తల్లిదండ్రులు విడాకులు తీసుకుని వేరువేరుగా ఉంటున్నారు. ఈ బాలిక తరచూ ఉత్తరప్రదేశ్, హరియాణాలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళుతూ ఉండేది. కానీ వారు తనని పట్టించుకోవడం లేదని ఆమె కుమిలిపోయింది. తీవ్ర దుఖంలో ఉన్న సమయంలో ఆ బాలిక సోదరి...ఆమెకు ఒక సలహా ఇచ్చింది. జైపూర్‌లో తనకు తెలిసిన వ్యక్తి ఉన్నాడని, అతని పేరు మోను అని, అతని దగ్గరికి వెళితే సాయం చేస్తాడని నమ్మబలికింది. కొత్త జీవితంపై ఆశతో ఆ బాలిక జైపూర్ వెళ్లింది. మోనును కలవడంతో బాలికను హోటల్‌కు తీసుకెళ్లాడు. ఆ బాలికపైనా అత్యాచారానికి పాల్పడ్డాడు. 20 రోజుల పాటు ఆ బాలికను బందీగా ఉంచాడు. మరో ఇద్దరు మైనర్లు కూడా ఆ బాలికపై అత్యాచారం చేసినట్లు తెలిపింది. మొదటి బాలిక హోటల్‌కు వెళ్లడం, అక్కడ రెండో బాలికను చూడటం...ఈ విషయం పోలీసులకు చెప్పడంతో కథ ఆలస్యంగా బయటపడింది. బాలిక ఫిర్యాదుతో పోలీసులు నిందితుడు మోనును అరెస్టు చేశారు. రెండో బాలికను రక్షించారు. అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు మైనర్లను కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని పోలీసులు వెల్లడించారు.

చంద్రుడి తొలి చిత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

విజయవంతంగా జరిగిందని ఇస్రో వెల్లడించింది. ల్యాండర్ (విక్రమ్), రోవర్ (ప్రజ్ఞాన్)తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ ఆరోగ్యంగా ఉందని తెలిపింది. ల్యాండర్ తన కక్ష్యను 113కిమీలు×157 కిమీలుగా తగ్గించుకుందని, మరోసారి డీబూస్టింగ్ 20వ తేదీ తెల్లవారుజామున 2 గంటలకు జరుగుతుందని ఇస్రో వెల్లడించింది. డీబూస్టింగ్ (వేగాన్ని తగ్గించే ప్రక్రియ) ద్వారా చంద్రుడికి అతి సమీపంలోని కక్ష పెరిలూనే (30కిమీలు), అపోలూనే (100కిమీ)లలోకి ల్యాండర్ మాడ్యూల్ ప్రవేశిస్తుంది. అంటే చంద్రుడికి మరింత చేరువవుతుంది. ఈనెల 23న చంద్రుడిని దక్షిణధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్‌కు యత్నిస్తుంది. ఇదిలావుంటే ప్రొపులేషన్ మాడ్యూల్ భూగోళ వాతావరణంపై అధ్యయనం కోసం చంద్రుడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. జీవించేందుకు ఎక్సో గ్రహాలు అనుకూలమో కాదో అన్నదీ గమనిస్తుంది. చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ దిగిన తర్వాత ప్రగ్యాన్ రోవర్ బయటకు వస్తుంది. ఆపై రోవర్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ఫొటోలను ల్యాండర్ తీసి పంపుతుంది. చంద్రుడిపై మట్టి తదితరాల గురించి సమాచారాన్ని రోవర్ సేకరిస్తుంది. దీంతో విస్తృత స్థాయి పరిశోధనకు మార్గం సుగమవుతుందని ఇస్రో వెల్లడించింది.

పారిశ్రామికవేత్తలు

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడుగురు రాజ్యసభ సభ్యుల మొత్తం ఆస్తుల విలువ రూ.5,596 కోట్లు కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 11 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ.3,823 కోట్లుగా ఉంది. ఇక ఉత్తరప్రదేశ్‌కు చెందిన 30 మంది రాజ్యసభ సభ్యుల ఆస్తుల విలువ రూ.1,941 కోట్లు ఉన్నట్లు ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. మహారాష్ట్రలోని 19 మందిలో ముగ్గురు, ఢిల్లీకి చెందిన ముగ్గురు ఎంపీల్లో ఒకరు, పంజాబులోని ఏడుగురు ఎంపీల్లో ఇద్దరు, హరియాణాలోని ఐదుగురు ఎంపీల్లో ఒకరు, మధ్యప్రదేశ్‌లోని 11 మందిలో ఇద్దరు ఎంపీలు తమ ఆస్తుల విలువ రూ.100 కోట్లుగా ప్రకటించినట్లు తెలిపింది.

మొత్తం 225 మంది రాజ్యసభ సభ్యుల్లో 75 మందిపై క్రిమినల్ కేసులున్నట్లు ఏడీఆర్ తెలిపింది. 41 మంది సిట్టింగ్ రాజ్యసభ సభ్యులపై తీవ్రమైన క్రిమినల్ కేసులుండగా, మరో ఇద్దరు ఎంపీలపై హత్య కేసులు నమోదైనట్లు వెల్లడించింది.

నలుగురు ఎంపీలపై మహిళా వేధింపులకు సంబంధించిన కేసులున్నట్లు తెలిపింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌పై అత్యాచార కేసు నమోదైనట్లు నివేదికలో పేర్కొంది. బీజేపీకి చెందిన 85 మంది సభ్యుల్లో 23 మందిపై, కాంగ్రెస్‌కు చెందిన 30 మంది సభ్యుల్లో 12 మందిపై క్రిమినల్ కేసులున్నట్లు వివరించింది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 13 మంది, ఆర్జేడీ నుంచి నామినేట్ అయిన ఐదుగురిపై, ఆమ్ ఆద్మీపార్టీకి చెందిన ముగ్గురు, వైసీపీకి చెందిన ముగ్గురు, ఎన్సీపీకి చెందిన ఇద్దరు ఎంపీలపై క్రిమినల్ కేసులున్నట్లు ఏడీఆర్ వెల్లడించింది.

నిరుద్యోగమే అతిపెద్ద సమస్య

(మొదటిపేజీ తరువాయి)



యువతకు నిరుద్యోగమే పెద్ద సమస్య అని వెల్లడించింది. ఏ ఉద్యోగాన్ని యువత ఎక్కువగా మొగ్గు చూపుతున్నారన్నదీ సర్వే తేల్చింది. డాక్టర్లు, నర్సులు ఇతరత్రా వైద్యరంగ ఉద్యోగాలను 16శాతం మంది కోరుకోగా 14శాతం మంది విద్యా రంగంపై, 10శాతం మంది సొంత వ్యాపారాలు, సైన్స్&టెక్నాలజీ ఉద్యోగాలపై ఆసక్తి కనబర్చారని తెలిపింది. మరో ఆరు శాతం మంది ప్రభుత్వ ఉద్యోగాలు కావాలంటే, ఉన్న ఉద్యోగాలు చాలని రెండు శాతం మంది చెప్పారని నివేదిక పేర్కొంది. ఉద్యోగావకాశాలు, అభ్యర్థుల ఆకాంక్షలు, యువత అంచనాలు వంటివాటి ఆధారంగా 18 రాష్ట్రాల్లో ఈ సర్వే జరిగింది. 9,316 మంది పాల్గొన్నారు. వారిలో 40శాతం మంది పట్టభద్రులు, అంతకంటే ఎక్కువ చదువుకున్న వారు ఉండగా 27శాతం మంది నిరక్షరాస్యులు ఉన్నారు. అలాగే 49శాతం మంది చిరుఉద్యోగులు, 40శాతం మంది ఉద్యోగులు, తొమ్మిది శాతం మంది పార్ట్‌టైమ్ ఉద్యోగులు, 23శాతం మంది స్వీయ ఉపాధిగలవారు, 16శాతం మంది వైద్యులు, ఇంజినీర్లు, 15శాతం మంది రైతులు, 27శాతం మంది శ్రామికులు, కార్మికులు, ఆరు శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. నచ్చిన ఉద్యోగం చేస్తున్న వారు 20శాతం మంది కాగా ప్రైవేటు కంటే ప్రభుత్వ ఉద్యోగాన్ని ఐదుగురిలో కనీసం ముగ్గురు కోరుకున్నట్లు సర్వే ద్వారా తేలింది. మరికొందరు సొంత వ్యాపారాలకు మొగ్గు చూపినట్లు నివేదిక వెల్లడించింది.

తిరుగుబాటు మొదలైందా?

(మొదటిపేజీ తరువాయి)

తిరిగి వచ్చే ఎన్నికల్లో టికెట్టుపై హామీ ఇవ్వకపోవడం వెరసి పార్టీని వీడుతున్నారు. తాజాగా గన్నవరం వైసీపీ నేత యార్లగడ్డ వెంకట్రావ్ వైసీపీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. రెండు, మూడు విడతలుగా గన్నవరం కేంద్రంగా ఆయన అనుచరులతో సమావేశం నిర్వహించి, తన అసమ్మతిని వెల్లడించినప్పటికీ... అధినేత నుంచి స్పందన లేకపోవడంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. లోకేశ్ పాదయాత్ర గన్నవరంలో ప్రవేశించే నాటికిగానీ, అంతకుముందుగానీ టీడీపీలో ఆయన చేరుతున్నట్లు సమాచారం. అంతకంటే ముందు టీడీపీ అధినేత చంద్రబాబును ఆయన కలిసే అకాశాలున్నాయి. కాగా యార్లగడ్డ వైఖరిని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తప్పుబట్టారు. ఆయనలా చేయడం తగదంటూ వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యే వంశీ రాకతో రివర్స్

2019 ఎన్నికల్లో గన్నవరం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన యార్లగడ్డ వెంకట్రావ్... స్వల్ప ఓట్లతో అప్పటి సమీప టీడీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలోకి రాగానే టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే వంశీ...వైసీపీకి మద్దతుగా రావడంతో సీన్ రివర్స్ అయింది. అయినా వెంకట్రావ్ పార్టీలోనే కొనసాగుతూ... కేడీసీసీ చైర్మన్ బాధ్యతల్ని నిర్వహించారు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా గన్నవరం టికెట్ తనకు ఇవ్వాలనే సంకేతాలతో చాలా సార్లు తన అనూయాయూలతో కలిసి నియోజకవర్గంలో బలప్రదర్శన సమావేశాల్ని నిర్వహించినా అధిష్ఠానం నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆయన పార్టీని వీడారన్న అభిప్రాయముంది.

వెంటాడుతున్న ఇంటెలిజెన్స్

వైసీపీలో అసంతృప్తిగా ఉన్న నేతలు, ఎమ్మెల్యేల కదలికలపై అధికార పక్షం పూర్తిగా నిఘా పెట్టింది. వారిని ఇంటెలిజెన్స్ యంత్రాంగం ఎప్పటికప్పుడూ వెంటాడుతోంది. తాజాగా గన్నవరం వైసీపీ నేత యార్లగడ్డ వెంకట్రావ్ టీడీపీ నేతలను ముందస్తుగానే కలిసి చర్చలు నిర్వహించారనే సమాచారాన్ని వైసీపీ ఆధిష్ఠానానికి ఇంటెలిజెన్స్ ముందుగానే చేరవేసింది. దీంతో అసంతృప్తి వైసీపీ నేతలంతా ఆందోళన చెందుతున్నారు. సొంత పార్టీ నేతలపైనే నమ్మకం లేకపోతే ఎలా అంటూ లోలోపల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఐ ప్యాడ్ టీమ్ ద్వారా వైసీపీ ఎమ్మెల్యేల కదలికలను పసిగడుతున్నారు. ఐ ప్యాడ్ టీమ్ సర్వే ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉంటుందని సాక్షాత్తూ అధినేత జగన్ ప్రకటించడంతో వారికి దిక్కుతోచడం లేదు. కొద్దిపాటి అసంతృప్తిని వెళ్లగక్కిన నేతలపై తక్షణమే నిఘా ఉంచుతున్నట్లు తెలుస్తోంది. వారు నియోజకవర్గాన్ని విడిచి ఎక్కడికి వెళ్లినా ఆరా తీస్తున్నారు. ఒక వైపు ఇంటెలిజెన్స్, మరోవైపు ఐ ప్యాడ్ బృందాలతో ఎమ్మెల్యేలు సతమతమైపోతున్నారు.

లోకేశ్ పాదయాత్రకు మద్దతు పలికిన ఎమ్మెల్యే శ్రీదేవి

వైసీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఉండవల్లి శ్రీదేవి ఇటీవల చంద్రబాబును కలవడం, అమరావతిలో లోకేశ్ పాదయాత్రకు మద్దతుగా ఆమె పాల్గొనడం వైసీపీకి షాక్ ఇచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై శ్రీదేవిపై వైసీపీ ఆధిష్ఠానం వేటు వేసింది. అప్పటి నుంచి ఆమెపై తాడికొండ నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు దుష్ప్రచారం చేస్తున్నారు. ఆమె ఇంటి వద్ద, కార్యాలయం దగ్గర నిరసనకు దిగారు. దీంతో ఉండవల్లి శ్రీదేవి హైదరాబాద్‌కే పరిమితమైపోయారు. తాజాగా లోకేశ్ పాదయాత్ర సమయానికి ఆమె బయటకు వచ్చి తన వెనుక చంద్రబాబు, లోకేశ్ ఉన్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీదేవితోపాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. ఆ నలుగురూ ఇప్పుడు టీడీపీ పక్షాన చేరడంతో వైసీపీకి తీరని నష్టం కలగనుంది. ఇటీవల విశాఖజిల్లా వైసీపీ అధ్యక్షుడు పంచకర్ల కూడా వైసీపీకి రాజీనామా చేసి, జనసేనలో చేరడం చర్చానీయాంశంగా మారింది. రాబోయే రోజుల్లో మరికొందరు వైసీపీ కీలక నేతలు పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారముంది. వచ్చే ఎన్నికల్లో టికెట్లపై అధిష్ఠానం నుంచి హామీ రానివారంతా అసంతృప్తితో ఉన్నారు. వీరంతా రాజకీయంగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

ఆర్థికాంశాలపై హామీ ఇవ్వాలి

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఆలస్యం కారణంగా వారు కోల్పోయిన ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ (ఏపీజీడబ్ల్యూ ఎస్ఈడబ్ల్యూఏ) డిమాండు చేసింది. విజయవాడ ఆటోనగర్‌లోని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యాలయంలో ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అధ్యక్షతన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించారు. దీనికి ఏపీజేఏసీ అమరావతి అనుబంధిత ఏపీజీడబ్ల్యూఎస్ఈడబ్ల్యూఏ నేతలు హాజరయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య, ప్రధాన కార్యదర్శి సీపాన గోవిందరావు సమస్యల్ని వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వ్యవసాయ విభాగం వారికి మిగిలిన విభాగాల తరహాగా బదిలీలు చేపట్టాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాలలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని క్రమబద్ధీకరించాలని, రెగ్యులర్ వేతనాలివ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, మొదట విడత ఉద్యోగులు కోల్పోయిన తొమ్మిది నెలలు, రెండో విడత కోల్పోయిన ఐదు నెలలకు సంబంధించిన ఆర్థిక, సర్వీస్ పరమైన అంశాలపైన స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సర్వీసు నుంచి వచ్చిన వారికి వేతన భద్రత కల్పించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తది తర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బగ్గా జగదీష్, ఉపాధ్యక్షురాలు జ్యోతి, కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏదీ ప్రోత్సాహం?

- ఎండుతున్న మొక్కలు
- అందని రాయితీలు
- పామాయిల్ రైతుల ఆవేదన

ప్లాంటేషన్ వేశాక ఎండిన మొక్కలు

విశాలాంధ్ర-లింగపాలెం: పామాయిల్ సాగును విస్తరింపజేయాలని, ఈ పంట వల్ల మెట్ట ప్రాంతంలోని రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని భావించి అధికారులు ప్రోత్సహిస్తున్నారు. అయితే ప్రభుత్వపరంగా ఇస్తామన్న ప్రోత్సాహకాలు పామాయిల్ రైతులకు సకాలంలో అందకపోవటంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్... పామాయిల్ సాగులో అగ్ర స్థానంలో ఉంది. ఏలూరుజిల్లా చింతలపూడి నియోజకవర్గంలోని రైతులు పామాయిల్ పంటపై ఆసక్తి చూపుతున్నారని అధికారులే అంటున్నారు. రాష్ట్రంలో లక్ష హెక్టార్లలో పామాయిల్ సాగవుతుంటే దీనిలో 20 వేల హెక్టార్లు ఒక్క ఏలూరు జిల్లాలోనే ఉంది. ఇదేకాకుండా ఈ ఏడాది జిల్లాలో 7 వేల 100 హెక్టార్లలో పంట వేయించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. 2024 మార్చి నాటికి మొక్కలు నాటాలి. ఈ ఏడాది ఇప్పటికి 1500 హెక్టార్లలో ఈ పంట సాగు చేశారు. కాగా ఈ ప్రక్రియలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇటీవల లింగపాలెం మండలంలో పర్యటించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఉద్యానశాఖాధికారుల ముందు రైతులు ఏకరువు పెట్టారు. ఇబ్బందులు లేకుండా చూస్తామని వీరిచ్చిన హామీ ఎప్పటికి నెరవేరుతుందో గానీ రైతులు మాత్రం నిరాశ నిస్పృహలతో ఉన్నారు. నర్సరీ నుంచి తెచ్చిన మొక్కలు నాటిన కొన్ని రోజులకే ఎండిపోతున్నాయి. ఒక్కో మొక్కను రూ. 190లకు కొనుగోలు చేస్తున్నారు. ఒక హెక్టారు విస్తీర్ణంలో మొక్కలు నాటడానికి దాదాపు రూ. 50 వేలు ఖర్చవుతుందని రైతులు తెలిపారు. వేసిన కొద్ది రోజులకే ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. నర్సరీలో పెంచే మొక్కల్ని 3 నుంచి 4 అడుగులు ఎత్తు పెరిగేలోపు పంపిణీ చేయాల్సి ఉండగా... 10 అడుగులు పెంచి పంపిణీ చేస్తున్నారని రైతులు అంటున్నారు. నర్సరీలో పెరిగిన మొక్కను 12 నెలల్లో భూమిలో నాటాల్సి ఉండగా... మొక్క సిద్ధం అయ్యాక మూడు, నాలుగు నెలలు ఉంచుతున్నారని వాపోతున్నారు. అంతేకాక పామాయిల్ రైతులకు రాయితీలు ఇస్తామని ఆశ చూపు తున్నారే కానీ మూడేళ్ళుగా అలాంటిదేమీ లేదని చెబుతున్నారు. ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి ఉందని, ఇటువంటి ప్రతికూల పరిస్థితుల వల్ల పామాయిల్ తోటలు వేయాలంటే భయపడుతున్నామని రైతులు అంటున్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధి సక్రమ పద్ధతులను అవలంబిస్తూ ప్రోత్సహిస్తే పామాయిల్ విస్తీర్ణం మరింతగా పెరుగుతుందని, అటువంటి పరిస్థితి లేదని రైతులు నిరాశ చెందుతున్నారు. ధర్మాజీగూడెంకు చెందిన మోరంపూడి సుబ్రహ్మణ్యం, కె.గోకవరంకు చెందిన ప్రసాద్ పామాయిల్ పండించటంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులకు స్వయంగా వివరించారు. ఆరేళ్లకు పంట దిగుబడి వస్తుందని, అప్పటివరకు అంతర పంటలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారని, ఒక ఏడాది, రెండో ఏడాది మాత్రమే అంతర పంటలకు అవకాశం ఉందని రైతులు అంటున్నారు. పామాయిల్ పండించే రైతుల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈ పంట సాగు చేయడానికి ఎవరూ ముందుకురారని రైతులు చెబుతున్నారు.

చలపాక ప్రకాశ్‌కు సీనియర్ ఫెలోషిప్

విశాలాంధ్ర-విజయవాడ : ప్రముఖ కవి, రచయిత చలపాక ప్రకాశ్ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అందించే సీనియర్ ఫెలోషిప్‌కు ఎన్నికయ్యారు. ఇందుకు గాను 2020-21 సంవత్సరానికి 'తెలుగు సాహిత్యంలో కరోనా కల్లోలం' అనే అంశంపై రెండేళ్లపాటు పత్ర సమర్పణ చేయాల్సి ఉంటుంది. ఈ పరిశోధనకుగాను ప్రకాశ్‌కు రెండేళ్లపాటు ప్రతి నెల రూ.20,000 చొప్పున ఫెలోషిప్ నగదు వేతనంగా అందిస్తారు. గతంలో ఇదే మంత్రిత్వ శాఖ నుంచి 'అత్యాధునిక కవితారూప ప్రక్రియ-నానీ' అనే అంశంపై పరిశోధన చేసిన చలపాక ప్రకాశ్ జూనియర్ ఫెలోషిప్ అందుకోగా...ఇప్పుడు సీనియర్ ఫెలోషిప్ అందుకోవడం విశేషం.

అరసం సభలకు ఉప్పల అప్పలరాజు

విశాలాంధ్ర - విశాఖ: అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభల్లో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రముఖ కవి, కథ, నాటక రచయిత ఉప్పల అప్పలరాజు ప్రతినిధిగా హాజరు కానున్నారని విశాఖ జిల్లా అరసం కార్యదర్శి పీ.శ్యామసుందర్, డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి ఇతర కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో మహాసభలు జరుగనున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా అప్పలరాజుకు వారు అభినందనలు తెలిపారు.

రిటైర్డ్ పోలీసు అధికారులకు సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ : పోలీసు శాఖకు సుదీర్ఘ కాలం పాటు తమ అమూల్యమైన సేవలు అందించి ఇటీవల పదవీ విరమణ పొందిన కేఆర్ఎం కిషోర్ కుమార్ (రిటైర్డ్ డీజీ), కేవీ రంగారావు (రిటైర్డ్ ఐజీ), వారితో పాటు తన మూడు సంవత్సరాల డిప్యుటేషన్ పూర్తి చేసుకుని కర్నాటకకు వెళుతున్న తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డిని డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు పాల్గొన్నారు.

మహిళలపై దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్ నేతల డిమాండ్

విశాలాంధ్ర-దర్శి: సభ్యసమాజం తలదించుకునేలా దళిత మహిళలపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్), దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆండ్రా మాల్యాద్రి, కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. దర్శి మండలం బొట్లపాలెంలో బాధిత దళిత మహిళ కుటుంబాన్ని కేవీపీఎస్- డీహెచ్‌పీఎస్ ప్రతినిధులు శుక్రవారం పరామర్శించారు. అనంతరం దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్‌ను కలిశారు. ఆండ్రా మాల్యాద్రి, కరవది సుబ్బారావు మాట్లాడుతూ... ప్రకాశం జిల్లా దర్శి మండలం బొట్లపాలెంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుడు జక్కుల సాయిరాం, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన భార్గవి అనే యువతి ప్రేమించి పెళ్లి చేసుకుంటే ఎస్సీ యువకుడితో పెళ్లిని జీర్ణించుకోలేక భార్గవి తల్లిదండ్రులు గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, భార్య పుల్లమ్మ, బ్రహ్మారెడ్డి తండ్రి రోసిరెడ్డి కులాంతర వివాహం చేసుకున్న కుటుంబంపై గతంలో (మార్చి నెలలో) కూడా దాడి చేశారని చెప్పారు. అప్పుడు కూడా తల్లి జక్కుల అనురాధ, కుమార్తె కామసూరి మౌనికలపై గొడ్డళ్లు, కర్రలతో దాడి చేశారన్నారు. కానీ రెడ్డి కులస్తుల హత్యాయత్నం ఘటనపై దర్శి ఎస్ఐ రామకృష్ణ ఐపీసీ 307 కింద కేసు నమోదు చేయకుండా, సాధారణ ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి స్టేషన్ బెయిలు ఇచ్చిన కారణంగానే మళ్లీ వారిపై దాడి జరిగిందని వారు తెలిపారు. దాడి చేసిన వారికి మద్దతుగా రామకృష్ణ... బాధితులైన జక్కుల అనురాధ, ఆమె కూతురు కామసూరి మౌనికపైనే దాడి చేసినట్లు కౌంటర్ కేసు 61/23 కట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బాధితులు ఈవిషయాన్ని ఎస్పీకి ఫిర్యాదు చేస్తేగాని దర్శి ఎస్ఐ దళిత బాధితులపై పెట్టిన కౌంటర్ కేసు తీసివేయలేదని వారు తెలిపారు. దళిత కుటుంబంపై కక్ష సాధించేందుకు అదును కోసం ఎదురుచూస్తున్న గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి అతని భార్య పుల్లమ్మ, తండ్రి రోసిరెడ్డి కులాంతర కుటుంబంలోని దళిత మహిళల కళ్లల్లో కారం చల్లి, గొడ్డలితో దాడి చేశారన్నారు. మౌనిక గుండెల పై కూర్చుని కత్తులతో పొడిచి ఈడ్చుకు వెళ్లి... వివస్త్రను చేసి స్తంభానికి కట్టేసి పెట్రోలు పోయటం ఆటవిక చర్యలను తలపిస్తోందని వారు తెలిపారు. పోలీసులు తీసుకెళ్తున్నప్పుడు కూడా బ్రహ్మారెడ్డి, పుల్లమ్మలు మేము జైలుకెళ్లినా కూడా మళ్లీ వచ్చి మీ ఇద్దరిని చంపుతాం... మల్లా జైలుకెళ్తాం... మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరంటూ బహిరంగంగా హెచ్చరించారంటే కుల దురహంకారం ఎలా తాండవిస్తోందో అర్థం చేసుకోవచ్చన్నారు. దళిత మహిళలపై దాడి ఘటనలో నిందితులకు బెయిల్ ఇవ్వకుండా విచారణ జరిపి... కఠిన శిక్ష పడేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. ఆటవిక హత్యాయత్నం ఘటనలో గాయపడిన బాధిత మహిళలు అనురాధ, మౌనిక కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని, మొదటి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన యస్ఐపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ సాధన కన్వీనర్ కొప్పోలు సుబ్బారావు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ రఘురామ్, సీఐటీయూ నాయకులు రంగారావు, సందు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులు రాజకీయాల్లో చురుకుగా ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ: అమెరికాకు వలస వచ్చి... ఈ దేశ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న ప్రవాసాంధ్రులు తమ భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్థానిక రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని రాజ్యసభ మాజీ సభ్యులు, పద్మ భూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కోరారు. మిచిగన్ రాష్ట్రంలోని నోవై నగర కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన ప్రవాసాంధ్రుడు పెద్దిబోయిన జోగేశ్వర రావు తన ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం ఇక్కడ స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోవై ప్రస్తుత, మాజీ మేయర్లతో కలిసి పాల్గొన్న యార్లగడ్డ జోగేశ్వరరావుకు తమ మద్దతును తెలిపారు. అమెరికాలో ఎదిగి, ఇక్కడ కుటుంబాన్ని, స్నేహితులను, ఉద్యోగాలను ఏర్పాటు చేసుకుని, అమెరికా పౌరసత్వం కలిగిన ప్రవాస భారతీయులు మాతృదేశ రాజకీయాల పట్ల తామరాకు మీద నీటి బిందువులుగా వ్యవహరించాలని యార్లగడ్డ సూచించారు. స్థానిక రాజకీయాల్లో, సేవా కార్యక్రమాల్లో సొంతింటిలో శుభకార్యంలా ముందు వరుసలో నిలబడే ధైర్యం చేయాలని కోరారు. తాను ప్రపంచవ్యాప్తంగా ఏ దేశానికి వెళ్లినా తన మిత్రులకు, స్నేహితులకు, శిష్యులకు స్థానికంగా మనల్ని మనం బలోపేతం చేసుకునేందుకు ఉన్న వనరులను గుర్తించి సద్వినియోగం చేసుకునేలా కృషి చేసేలా ప్రోత్సహించినట్లు గుర్తుచేశారు. జోగేశ్వరరావుకు నోవైలో భారతీయులతో సత్సంబంధాలు బలంగా ఉన్నాయని, ఆయన విజయం సాధించాలని లక్ష్మీప్రసాద్ ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీలుగా పద్మశ్రీ, రవిబాబు ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గవర్నరు కోటాలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన మండలికి సభ్యులుగా నియమితులైన కర్రి పద్మశ్రీ, డాక్టర్ కుంభా రవిబాబు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వెలగపూడిలో రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు తమ ఛాంబర్‌లో ఈ ఇద్దరితో ప్రమాణ స్వీకారం చేయించారు. శాసన మండలి సభ్యులుగా వారు పాటించవలసిన నియమనిబంధనలు, అనుసరించాల్సిన విధి విధానాలు, నిర్వర్తించాల్సిన కార్యకలాపాలు తదితర విషయాలను తెలిపే పుస్తకాలతో కూడిన కిట్లను అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు వారికి అందజేస్తూ అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, పాలకొండ శాసనసభ్యురాలు విశ్వసరాయి కళావతి తదితరులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీలను దుశ్శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సెక్రటరీ జనరల్ డా.పి.పి.కె. రామాచార్యులు, రాష్ట్ర శాసన మండలి ఓఎస్‌డి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీలు పద్మశ్రీ, రవిబాబు

శాసనమండలి సభ్యులుగా నియమితులైన కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం తమ కుటుంబ సభ్యులతో జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

యార్లగడ్డ ముందే నిర్ణయం తీసుకున్నారేమో!

బహిరంగ వ్యాఖ్యలు తగదు: సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎవరికైనా వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని, అందుకే యార్లగడ్డ వెంకట్రావు ముందస్తుగానే నిర్ణయం తీసుకున్నారేమోనని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీలో ఆశావహులు ఎంతమంది ఉన్నప్పటికీ టికెట్లు అందరికీ ఇవ్వడం సాధ్యం కాదని సజ్జల తెలిపారు. ముందు పార్టీ కోసం పని చేసి, ఆ తర్వాత అవకాశం కోసం ఎదురు చూడాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గన్నవరం వైసీపీ నేత యార్లగడ్డ వెంకట్రావు రాజీనామా పై స్పందించారు. వైసీపీ బలమైన స్థానంలో ఉన్నందునే చాలామంది భవిష్యత్తును ఆశిస్తారన్నారు. యార్లగడ్డ వెంకట్రావు తనకు అసంతృప్తి ఉంటే సీఎం జగన్ దృష్టికి నేరుగా తీసుకెళ్లవచ్చునని, అంతేగాని బహిరంగ సమావేశాల ద్వారా తన అసంతృప్తిని వెళ్లగక్కడాన్ని తప్పుబట్టారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి ఆయన సమస్యలను తీసుకెళ్తే పరిష్కారం ఉండేదన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే టికెట్ రానంతమాత్రాన నిరాదారణకు గురైనట్లు కాదని సజ్జల అన్నారు. టికెట్ల వ్యవహారం నుంచి పార్టీలో అసంతృప్తుల వరకు అంతర్గతంగానే చర్చ జరగాలని, అవి బహిర్గతం కాకూడదన్నారు. ఒకసారి పార్టీ అవసరాలకు అనుగుణంగా నేతలు సర్దుకుపోవాలన్నారు. అవసరమైతే పార్టీ బాధ్యతలు కూడా తీసుకోవచ్చని, మళ్లీ అవకాశం వచ్చినప్పుడు పోటీలోకి వెళ్లవచ్చని, అలా వెళ్లిన నేతలు చాలామంది ఉన్నారని వివరించారు. అందరూ టికెట్లను ఆశిస్తే ఏ పార్టీకి మనుగడ ఉండబోదన్నారు. తాను యార్లగడ్డకు టికెట్ ఇవ్వబోమంటూ బహిరంగంగా ఎక్కడా చెప్పలేదన్నారు. అదే సమయంలో టీడీపీ నాయకులతో యార్లగడ్డ టచ్‌లో ఉన్న విషయాన్ని ఎవరూ ప్రస్తావించలేదని స్పష్టం చేశారు. యార్లగడ్డ తన సమస్యను అంతర్గతంగా తేల్చుకోక పోగా, ఇలా బహిరంగంగా మీడియాతో మాట్లాడటం సరికాదన్నారు.

బాల్యవివాహాలు చేసుకుంటే ప్రభుత్వ పథకాలు కట్

ప్రజల్లో విస్తృత అవగాహనకు సీఎస్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బాల్య వివాహాల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశాలిచ్చారు. 18ఏళ్ల లోపు వారికి పెళ్లిళ్లు చేస్తే ఆ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు వర్తించబోవని స్పష్టంచేశారు. ఈ మేరకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా బాల్య వివాహాలను నివారించాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణకు చేపట్టనున్న ప్రచార వ్యూహంపై వివిధ శాఖల అధికారులతో వెలగపూడి సచివాలయంలో సీఎస్ శుక్రవారం సమీక్షించారు. బాల్య వివాహాల నియంత్రణకు ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ రూల్స్-2012, 2023 నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకోసం మహిళా శిశు సంక్షేమం, సెర్ప్, విద్యా, వైద్య ఆరోగ్య తదితర శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణలో విఫలమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో సర్పంచ్ లేదా వార్డు కౌన్సిలర్ అధ్యక్షతన బాల్య వివాహాల నియంత్రణ పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని, వాటిలో వార్డు కార్యదర్శి, గ్రామ, వార్డు రెవెన్యూ అధికారి, ఏఎన్ఎం, మహిళా పోలీస్, స్వయం సహాయక సంఘం సభ్యులు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు లేదా ప్రధానోపాధ్యాయుడు, ఎన్జీవోల ప్రతినిధులను సభ్యులుగా చేయాలని సూచించారు. చర్చీలు, మసీదులు, ఆలయాల్లో లైసెన్సు కలిగిన పాస్టర్లు, ఖాజీలు, పంతులు అధ్వర్యంలో వివాహాలు జరుగుతున్నాయని, బాల్య వివాహాలు జరగకుండా తగిన ఆదేశాలు జారీచేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. వివాహ నమోదు గడువును 60 రోజుల నుంచి ఆరు మాసాలకు పెంచేలా సంబంధిత చట్ట సవరణకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. బాల్య వివాహాల నియంత్రణ చట్టం, నియమ నింబధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి వివరించారు. వీడియో లింక్ ద్వారా సెర్ప్ సీఈవో ఇంతియాజ్ పాల్గొనగా, మహిళా, శిశు సంక్షేమశాఖ కమిషనర్ జానకి, విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్య నారాయణ, హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రామకృష్ణ, న్యాయశాఖ అదనపు కార్యదర్శి వి.సునీత, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ అర్జునరావు, గ్రామ వార్డు సచివాలయాల అధికారి భావన, సమాచారశాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత పాల్గొన్నారు.

నడక మార్గాల్లో పండ్లు, కాయల్ని విక్రయించొద్దు

టీటీడీ ఈవో ధర్మారెడ్డి

విశాలాంధ్ర-తిరుమల: నడక మార్గాల్లో భక్తుల భద్రత దృష్ట్యా క్రూర మృగాలు సంచరించకుండా నివారించేందుకు కాయలు, పండ్లు వంటివి విక్రయించరాదని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి సూచించారు. తిరుపతిలోని పరిపాలనా భవనంలో పోలీసు, అటవీ, ఎస్టేట్, ఆరోగ్య శాఖ అధికారులతోపాటు దుకాణాల నిర్వాహకులతో ఈవో శుక్రవారం సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ నడకమార్గాల్లో విక్రయాలకు సంబంధించి అటవీ, ఎస్టేట్, ఆరోగ్యశాఖల అధికారులతో పాటు భక్తులు కూడా అనేక సూచనలు చేసినట్లు చెప్పారు. అలిపిరి నడక మార్గంలో వందకు పైగా తినుబండారాలు విక్రయించే దుకాణాలు ఉన్నాయని, వీటిలో ఇకపై పండ్లు, కూరగాయలు విక్రయించరాదని సూచించారు. భక్తులు వీటిని కొనుగోలు చేసి సాధు జంతువులకు తినిపించడం వల్ల వాటి రాక పెరుగుతోందని, ఈ జంతువుల కోసం క్రూరమృగాలు అటువైపు వచ్చి భక్తులపై దాడి చేస్తున్నాయని వివరించారు. అన్ని దుకాణాల వద్ద తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా చెత్తకుండీల్లో వేయాలని, అలా చేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నడక మార్గంలో రోజుకు రెండు నుంచి మూడు టన్నుల చెత్త పోగవుతోందని, దీనిని ఆరోగ్య శాఖ సిబ్బంది క్రమం తప్పకుండా తొలగిస్తున్నారని చెప్పారు. భద్రతా చర్యల్లో భాగంగా నడకదారి పొడవునా సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తామన్నారు. తినుబండారాల దుకాణదారులు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. క్రూరమృగాల జాడ కనిపిస్తే వెంటనే తెలిపేందుకు వీలుగా అటవీ, ఆరోగ్య, విజిలెన్స్ విభాగాల అధికారుల ఫోన్ నంబర్లు ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మునిరామయ్య, సీసీఎఫ్ నాగేశ్వరరావు, టీటీడీ ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, తిరుపతి డిఎఫ్‌వో సతీశ్, టీటీడీ డిఎఫ్‌వో శ్రీనివాస్, ఎస్టేట్ ప్రత్యేకాధికారి మల్లికార్జున, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, ఈఈ సురేంద్రనాథ్‌రెడ్డి, డీఈ ఎలక్ట్రికల్ రవిశంకర్‌రెడ్డి, వీజీవోలు బాలిరెడ్డి, గిరిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర దోపిడీకే...

రాజధాని పేరిట హడావుడి: పవన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖ పట్నం: ఉత్తరాంధ్రలోని అపార వనరులను దోచుకునేందుకే విశాఖ రాజధాని అంటూ ముఖ్యమంత్రి జగన్ హడావుడి చేస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. ఉత్తరాంధ్రలో 30 వేల ఎకరాలకు పైగా భూములు జగన్ అండ్ కో గుప్పిట్లో ఉన్నాయని, దోచేసిన భూముల విలువ పెంచేందుకే రాజధాని జపం చేస్తున్నారని పవన్ ఆరోపించారు. ఈనెల 10వ తేదీ నుంచి 17 తేదీ వరకూ విశాఖలో వారాహి మూడో విడత యాత్ర సందర్భంగా జరిగిన విషయాలను శుక్రవారం మధ్యాహ్నం ఓ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు. విశాఖలో వారాహి యాత్ర విజయవంతమైందని, అనేక కుంభకోణాలు, దోపిడీలు, దౌర్జన్యాలతోపాటు వైసీపీ నేతలు దోపిడీని కళ్లారా చూశానన్నారు. తనకు అనేక ఫిర్యాదులు అందాయని పవన్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ రాజకీయ నాయకుడు కాదని, ఆయన ఒక వ్యాపారని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని రాష్ట్రంలో చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడన్నారు. వైఎస్ హయాంలో తెలంగాణలోనూ విచ్చలవిడి దోపిడీ చేశారని, దోపిడీకి వ్యతిరేకంగానే మానుకోటలో జగన్‌పై రాళ్లదాడి జరిగిందన్నారు. దోపిడీదారుల నుంచి ఉత్తరాంధ్రను కాపాడేందుకు జనసేన కృషి చేస్తుందని పవన్ వెల్లడించారు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ నేరాలకు నిలయంగా మారిందని దుయ్యబట్టారు. చిత్తూరులో ఒకేరోజు చాలా మంది బాలికలు అదృశ్యమయ్యారని ఆరోపించారు. దీనిపై దర్యాప్తు చేయాలని కోరితే పోలీసులు ఏమీ జరగనట్లే మాట్లాడుతున్నారన్నారు. 'పోలీస్ స్టేషన్ వరకు రాకముందే చాలా పిటిషన్లు నా వద్దకు వస్తున్నాయి... పోలీసులను ప్రశ్నిస్తే తల్లిదండ్రుల పెంపకంలో లోపమని చెబుతున్నారు. ప్రశాంత విశాఖలో నేర సంస్కృతి బాగా పెరిగింది. తాడేపల్లిలోనూ నేరాల తీవ్రత పెరిగింది. పోలీసుల వద్దకు వెళితే ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు' అని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటిష్ హయాంలో కంటే తీవ్రంగా విభజించి పాలిస్తున్నారని, విశాఖలో మత్స్యకారుల మధ్య రింగు వలల పేరిట రగడ రేపారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, మైనింగ్ వ్యాపారం జరుగుతోందని, ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులకు రూ. వేల కోట్లు అక్రమంగా వెళ్తున్నాయన్నారు. విశాఖలో పెద్దఎత్తున భూ దోపిడీ జరుగుతోందని, లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వుతున్నారని, విశాఖలో 271 ఎకరాల్లో తవ్వకాలు జరిపి కడప సిమెంట్ కర్మాగారానికి తరలిస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్ అయిన లక్ష్మణరావు పేరు మీద లేటరైట్ తవ్వకాల అనుమతులు పొంది వైసీపీ నేతలు బినామీలుగా మారారన్నారు. ఖనిజాల తవ్వకాలతో పర్యావరణం తీవ్ర స్థాయిలో విధ్వంసం అవుతోందన్నారు. అనకాపల్లి జిల్లా విస్సన్నపేట దోపిడీ మరింత దుర్మార్గం అన్నారు. అగనంపూడి టోల్ గెట్ పేరిట 25 ఏళ్లు దోచుకున్నారని, ఇంకా దోచుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్రం పన్నులమయం అయిపోయిందని, ప్రజలపై చెత్త దగ్గర నుంచి అన్నింటిపై పన్ను భారాలు వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చేది జనసేన - బీజేపీ ప్రభుత్వమా? టీడీపీ- జనసేన- బీజేపీ ప్రభుత్వమా? అనేది పొత్తులు నిర్ణయిస్తాయని పవన్ తెలిపారు. తప్పులు చేసిన ఏ ఒక్కరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవికి సంసిద్ధంగా ఉన్నానని ఎప్పుడో చెప్పానని పవన్ చెబుతూ...అయితే మాకు ఇచ్చేవిధంగా ప్రజలు మద్దతు కూడా ఉంటేనే అది సాధ్యం అవుతుందన్నారు. నాయకత్వాన్ని బలోపేతం చేయడం మా ధ్యేయమని, ఆ విధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. 151 సీట్లు ఇచ్చిన ప్రభుత్వం అద్భుతంగా పాలన చేసి ఉంటే నేను మాట్లాడే వాడిని కాదని, ఏ ప్రభుత్వం తప్పులు చేసినా నేను విమర్శించానన్నారు. వైసీపీతో పోల్చినప్పుడు టీడీపీ బెటర్ అనిపించిందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.

23 నుంచి పాలిటెక్నిక్ తరగతులు

విశాలాంధ్ర-విజయవాడ : పాలిసెట్ 2023 ప్రవేశాలకు సంబంధించి శుక్రవారం విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, పాలిసెట్ కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. 34,624 మంది విద్యార్థులు ఆప్షన్లను ఎంపిక చేసుకోగా, 34,122 మందికి సీట్లు కేటాయించామన్నారు. 88 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 10,456 సీట్లు, 181 ప్రవేటు పాలిటెక్నిక్‌లలో 23,666 సీట్లు భర్తీ చేశామన్నారు. వీరంతా ఈ నెల 23వ తేదీ లోపు అయా కళాశాలల్లో వ్యక్తిగతంగా రిపోర్టు చేయవలసి ఉంటుందని కన్వీనర్ స్పష్టం చేశారు. సీట్లు పొందిన విద్యార్థులకు 23వ తేదీ నుంచే క్లాసులు ప్రారంభమవుతాయని నాగరాణి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్‌లలో 82,729 సీట్లు ఉండగా, తొలి విడతలో మిగిలిన సీట్లను తుది విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని వివరించారు.

సంపాదకీయం

ముందే కూసిన మోదీ కోయిల

నిరంతరం ఎన్నికల ధ్యాసలోనే ఉండే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ ఏడాది ఆఖరులోగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ఓటమి భయం పట్టుకుంది. ప్రస్తుతం అధికారంలోఉన్న రాష్ట్రాలలోనైనా అధికారం నిలబెట్టుకోలేకపోతే 2024లో జరగవలసి ఉన్న సార్వత్రిక ఎన్నికలలోనూ తెల్లమొహం వేయాల్సి వస్తుందన్న భయం మోదీని అమితంగా పీడిస్తోంది. మణిపూర్ లో ఘోరమైన మారణకాండ జరిగితే అక్కడ పర్యటించే సమయం మోదీకి లేదు కానీ ఎన్నికలు జరగవలసి ఉన్న రాష్ట్రాలలో అప్పుడే ప్రచార ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రతిపక్షాల మీద దుమ్మెత్తి పోస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ వంశపారంపర్య పాలనకు ప్రాధాన్యం ఇస్తుందని దుయ్యబడ్తున్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉంది. మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్ చాలా కాలంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఆయన మీద అసంతృప్తి నానాటికీ పెరిగిపోతోంది. ఒకవేపు అధికారంలోఉన్న రాష్ట్రాలలో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను అధిగమించి మళ్లీ అధికారం నిలబెట్టుకోవాలన్న తాపత్రయం, మరో వేపు కాంగ్రెస్ చేతిలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లోనూ కాంగ్రెస్‌ను గద్దెదించాలన్న ఆశ మోదీకి ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఇంకా ఈ రాష్ట్రాలలో ఎన్నికల కార్యక్రమం ప్రకటించకపోయినా తొందరపడి కూసే కోయిలలాగా రెండునెలల ముందే బీజేపీ మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల తొలి జాబితా గురువారం విడుదల చేసింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ప్రధానమైన పోటీ కాంగ్రెస్‌కు, బీజేపీకి మధ్య ఉంటుంది. అందువల్ల తమ అభ్యర్థులకు ప్రచారానికి ఎక్కువ సమయం ఉండడానికి ముందే జాబితా విడుదల చేశారు. ముందే అభ్యర్థులను ప్రకటించేస్తే టికెట్టు దక్కనివారి అసమ్మతిని ఏదో ఒకరకంగా సర్దుబాటుచేసే అవకాశం ఉంటుందని బీజేపీ అంచనా. పోటీచేయడానికి అవకాశంరాని అసంతృప్త వాదులకూ ఎక్కువ సమయమే చిక్కుతుందన్న వాస్తవాన్ని బీజేపీ గుర్తించినట్టులేదు. పైగా బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో బీజేపీ నాయకత్వంలో కుమ్ములాటలకు కొదవలేదు. ఎవరి బలాన్ని వారు నిరూపించుకోవడానికి సకల ప్రయత్నాలూ చేయక మానరు. వివిధ సర్వేలనుబట్టి చూస్తే చాలాచోట్ల బీజేపీ ఓటమిఖాయం అన్న అభిప్రాయమే కలుగుతోంది. ఆయా రాష్ట్రాలలో ఉన్న అనుకూల, ప్రతికూల వాతావరణం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసినట్టే బీజేపీ ఓటమి ఖాయమన్న జనాభిప్రాయం కూడా గడ్డుపరిస్థితికి దారి తీయవచ్చుననని బీజేపీ భావిస్తోంది. చత్తీస్‌గఢ్ శాసనసభ గడువు 2024 జనవరి మూడున, మధ్యప్రదేశ్ శాసనసభ గడువు జనవరి 16న ముగుస్తుంది. ఆ లోగా ఎన్నికల కార్యక్రమం పూర్తి కావాల్సిఉంది. ఈ అయిదు రాష్ట్రాల ఎన్నికల కార్యక్రమం ఎన్నికల కమిషన్ ఒకేసారి ప్రకటించే సూచనలున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కువ లోకసభ స్థానాలు సంపాదించాలన్నది బీజేపీ వ్యూహం. 2019 ఎన్నికలలో మధ్యప్రదేశ్‌లోని 29 లోకసభ స్థానాలలో 28, ఛత్తీస్‌గఢ్‌లోని 11 సీట్లలో తొమ్మిది స్థానాలు బీజేపీ సంపాదించింది. కిందటి లోకసభ ఎన్నికలలో పుల్వామా ఘటన బీజేపీ విజయానికి తోడ్పడింది. కానీ పుల్వామా ఘటన ఎంత బూటకమో నాలుగు రాష్ట్రాలకు గవర్నరుగా పనిచేసిన సత్యపాల్ మాలిక్ బయట పెట్టారు. ఈ వాస్తవాలు వెలికిరావడంతో మోదీ వెన్నులో ఒణుకు పుట్టిస్తోంది. ఇతర రాష్ట్రాలలో కూడా పుల్వామా "కల్పిత" ఘటన ప్రభావం బీజేపీకి ప్రతికూలంగా పని చేయవచ్చు. ప్రస్తుతం ఏ రాష్ట్రంలోనూ బీజేపీకి అనుకూల అంశాలు ఏమీలేవు. కేంద్ర ప్రభుత్వం మీద వ్యతిరేకత కూడా క్రమంగా పెరుగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ అక్కడ కాంగ్రెస్ మీదా సహజమైన వ్యతిరేకత కనిపిస్తూనేఉంది. కాంగ్రెస్‌మీద అసంతృప్తిని ఆసరాగా చేసుకుని ఆ రాష్ట్రంలో అధికారం సంపాదించవచ్చునన్నది బీజేపీ ఎత్తుగడ. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్ మీద ఎంత వ్యతిరేకత ఉన్నప్పటికీ బీజేపీలో కుమ్ములాటలు ఆ పార్టీ విజయానికి ఆటంకం కలిగించవచ్చు. డబుల్ ఇంజన్ సర్కారు అన్న మోదీ నినాదమే మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ప్రతికూలం కావచ్చు. ఎందుకంటే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం బీజేపీదే. కేంద్రంలోనూ బీజేపీయే అధికారం ఉంది. అందువల్ల బీజేపీ మీద వ్యతిరేకత రెండు విధాలుగా బీజేపీని దెబ్బతీయవచ్చు. చత్తీస్‌గఢ్‌లో అయితే 2018 శాసనసభ ఎన్నికలలో 32.97 శాతం ఓట్లు సాధించిన బీజేపీ 15 అసెంబ్లీ స్థానాలు సాధించింది. కాంగ్రెస్ 43.4 శాతం ఓట్లతో 68 స్థానాలు గెలుచుకుంది. ఈ రెండు పార్టీలు సాధించిన ఓట్ల శాతంలో దాదాపు 11 శాతం అంతరం ఉంది. ఈ అంతరం బీజేపీకే ఎక్కువ నష్టదాయకంగా ఉంది. మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 స్థానాలు ఉంటే 35 స్థానాలు ఎస్.సి.లకు, 47 సీట్లు ఎస్.టి.లకు ప్రత్యేకించారు. ఈ రెండు వర్గాలూ బీజేపీ మీద ఆగ్రహంగా ఉన్నాయి. 2018 శాసనసభ ఎన్నికలలో బీజేపీ నడిపిన మంత్రాంగం అందరికీ తెలిసిందే. అది బీజేపీ అధికార దాహానికి పరాకాష్ఠ. నిజానికి అప్పుడు 40.89 శాతం ఓట్లు సంపాదించిన కాంగ్రెస్ కు 114 స్థానాలు దక్కాయి. బీజేపీకి వచ్చిన ఓట్ల శాతం 41.02 శాతం. కానీ 109 సీట్లే వచ్చాయి. కానీ కాంగ్రెస్‌లో చీలికలు తీసుకొచ్చి బీజేపీ అధికారం కాజేసింది. మధ్యప్రదేశ్‌లో గాలి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. రాహుల్‌గాంధీ పలుకుబడి పెరుగుతోంది. మధ్యప్రదేశ్‌లో 39మంది అభ్యర్థుల జాబితా బీజేపీ ప్రకటించింది. వీటిలో 21 స్థానాలు రిజర్వుడ్ సీట్లే. అయిదుగురు మహిళలకు కూడా బీజేపీ తొలి జాబితాలో చోటుదక్కింది. ఎస్.సి.లు, ఎస్.టి.లలో శివరాజ్‌సింగ్‌పాలనపై గూడుకట్టుకున్న వ్యతిరేకత ఏమాత్రం పనిచేస్తుందో చూడాలి. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ విడుదల చేసిన 21మంది జాబితాలో ఉంటే ఈ స్థానాలన్నింటిలోనూ గత ఎన్నికలలో బీజేపీ ఓడిపోయినవే. 2018 ఎన్నికలలో ఓడిపోయినవారి స్థానంలో ఈసారి బీజేపీ కొత్త వారికి అవకాశం ఇచ్చింది. వీరందరూ జిల్లాస్థాయి నాయకులే. అంతర్గత కుమ్ములాటల్లో వీరిదేప్రధానపాత్ర. రాజస్థాన్‌లో బలమైన నాయకురాలైన వసుంధరా రాజేను పక్కనపెట్టి విజయం సాధించాలని బీజేపీ ఎలా అనుకుంటోందో తెలియదు.

చాక్లెట్ సార్‌ని ఎందుకు మిస్ అయ్యాను

జీవితంలో చాలా మందిని ఎందుకో కాని కలవలేం. వారో, వారి బంధువుల చుట్టూనే మన ఆలోచనలున్నా అలాంటి వారిని కలవలేక పోవడానికి కారణాలు తెలియవు. కలవలేం అంతే. ఇది చాలా మందికి అనుభవంలోకి వచ్చిన పాతమే. ముఖ్యంగా ఎవరైనా తనువు చాలించిన తర్వాత వారి గురించి మరొకరు చెబుతూంటే "అరే... ఆయన్ని ఎందుకు కలవలేదు. ఆమెతో ఎందుకు మాట్లాడలేదు. వారున్న ఊరు చాలాసార్లు వెళ్లాంకదా... ఎలా మిస్ అయ్యామబ్బా" అని అవతలి వారు లేరని తెలిసాకా అనిపిస్తుంది. అలాంటివారి గురించి ఎవరైనా చెబుతూంటే ఆ బాధ మరింత ఎక్కువవుతుంది. ముఖ్యంగా సంగీత, సాహిత్య, సినీరంగాల్లో అయితే నాలా ఈ అనుభవం ఉన్నవారు ఎక్కువమందే ఉంటారు. నా మటుకు నాకు సరస్వతీ పుత్రుడు పుట్టపర్తి నారాయణాచార్యుల వారిని కలవనందుకు చాలాకాలం ఏదో పోగొట్టుకున్నట్లు అనిపించింది. జంధ్యాల పాపయ్యశాస్త్రి, ఘంటశాల, అద్భుత కవి త్రిపుర, నటి సావిత్రి, సూర్యకాంతం వంటి మహానుభావులు తలంపుకొచ్చినప్పుడు చూడలేకపోయామే అని బాధేస్తుంది. వీళ్లు సరే, చాలా పెద్దవాళ్లు. కాని మనలోనే చాలా పెద్ద మనసుండి....పైకి మాత్రం సాదాసీదాగా ఉండి వారి

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

గొప్పతనం బహిర్గతం కాకుండా.. లేదూ చేసుకోకుండా ఉన్నవారిని కలవలేక, ఇక కలవలేమని తెలిసాక ఎందుకో మనసు ఊరికే ఉండదు. కవిత్వం చదువుతున్నప్పుడో, కథ రాస్తున్నప్పుడో, ఎవరిదైనా ఆత్మకథ గుర్తుకొచ్చినప్పుడో అనిపిస్తుంది ఇలాంటి వారిని చూడలేకపోయామే అని. ఇది సాహితీవేత్తలకే కాదు....ఇలాంటి గాయాలు మాన్యులకు, సామాన్యులకు కూడా కలిగే సామాజిక కన్నీరు. పైకి ఇది వ్యక్తిగతంగా కనిపిస్తుందేమో కాని ఇది వసుధైక వేదన. ఇదిగో ఇలాంటి వేదనే పదిరోజులుగా నన్ను వెంటాడుతోంది. ఈ మధ్యనే కాలంచేసిన మోతడక పాండురంగ విఠల్ గురించి తెలిసిన తర్వాత నన్ను ఈ ఆవేదన వెంటాడింది. ఆయనలేరనే దుర్వార్త సోషల్ మీడియా నా కంట్లో పడేసింది. మిత్రుడు వాడ్రేవు చినవీరభద్రుడి బావగారు లేరని, నా ఇష్ట రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి సహచరుడే ఈయనని తెలిసింది. అయ్యో అనుకున్నాను... వీరలక్ష్మీదేవి గారికి ఎంతకష్టం వచ్చిందని, చినవీరభద్రుడి కన్నీరు గురించి ఓ రెండురోజులు బాధపడ్డాను. ఫేస్‌బుక్‌లో పాండురంగ విఠల్‌లేని లోటు గురించి ఒకరిద్దరు మిత్రులు బాధపడుతూ పోస్టుపెడితే చదివి ఆ మిత్రులనే అడిగాను ఈయన వీరలక్ష్మీదేవిగారి భర్తగానే తెలుసా. లేక ఇంకేమైనా విశేషముందా అని. అదిగో ఆ సమయానే ఈ పాండురంగ విఠల్ గారిని కలవలేదెందుకని బెంగటిల్లాను.

తన ఇంటికి వచ్చిన వారెవ్వరినైనా పాండురంగ విఠల్ చిరనవ్వుతో, చేతిలో చాక్లెట్‌తో స్వాగతం పలికేవారని తెలిసి జ్ఞానమొచ్చిన ఈ మూడు పదుల జీవితంలో (నా ఈ శరీరానికి 54 ఏళ్లు వయసు) ఆయన చేతి చాక్లెట్ తీసుకోలేకపోయానే అని చింతించాను. నాణాలలోనో, కాగితాలలోనో కొలిచే విలువున్న చాక్లెట్‌కాదని, ఆ తియ్యందనంలో ఓ గొప్ప ఆత్మీయత ఉంటుందని నా మిత్రులుచెప్తే గాయంచుట్టూ చీము పట్టినట్లు అయ్యింది. సాహిత్యంలో కవుల భార్యలస్థానం నాకు చాలాపరిచయం. బంధుత్వం కలుపుకుని వారి వంటింట్లోకి వెళ్లి కావాల్సింది తిన్న అనుభవమూ ఉంది. కాని కవయిత్రుల భర్తల గురించే నాకు సరిగా తెలియదు. నిజానికి నాకే కాదు.... వారి గురించి చాలామందికి తెలిసే అవకాశం కూడా ఉండదని నా నమ్మకం. ఆ జాబితాలోనే పాండురంగ విఠల్‌నీ కలిపేసుంటాను. తీరా ఆ పావురం వెళ్లిపోయిన తర్వాత ఆ రెక్కలు తనకింద ఎంత సాహిత్యాన్ని, సాన్నిహిత్యాన్ని దాచుకున్నాయో ఒక్కొక్కటిగా తెలుస్తుంటే...ఇందుకే ఈ క్షణజీవిత ప్రయాణంలో వీలున్నంత మందిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నాను. వాడ్రేవు వీరలక్ష్మీదేవి ఇంటికి వెళ్లిన సాహితీవేత్తలను పాండురంగ విఠల్ తొలి పలకరింపు "థాంక్స్" అని విన్నాను. నిజానికి చాలామంది తమ ఇంటికి వచ్చినవారికి స్వాగతం పలకడం ఆనవాయితీ. కాని ఈ థాంక్స్ వెనుక "మీరు మా ఇంటికి వచ్చినందుకు" అనే ఆత్మీయత దాగిఉండడం బహుశా అరుదుగా కనిపించే అద్భుత సందర్భం. ఇది తెలిసాక నేను ఎందుకు థాంక్స్ చెప్పించుకోలేకపోయానని దిగులుపడ్డాను. వీరలక్ష్మీదేవి కవయిత్రిగా, రచయిత్రిగా, విమర్శకురాలిగా లబ్ధప్రతిష్టులు. తెలుగు సాహిత్య సమాజం ఈ గౌరవాన్ని ఆమెకు ఎప్పుడో ఇచ్చింది. ఎప్పుడూ ఇస్తుంది. కాని, వీరలక్ష్మీదేవి పిహెచ్‌డీ పట్టా కోసం చదువుతూ, రాస్తూ విషయ సేకరణకోసం ఎక్కడికైనావెళ్తే ఆమె పుస్తకాల కట్టలను భుజానకెత్తుకుని పక్కన కొండంత పిహెచ్‌డీలా నిలుచున్న పాండురంగ విఠల్‌ని ఎలాచూడాలి. "నా పుస్తకాలునేనే పట్టుకుంటాను" అన్న వీరలక్ష్మీదేవి "నీకెందుకు ఈ శారీరక శ్రమ. నే ఉన్నానుగా "అంటూ భార్యకు రానున్న యశస్సును భుజాల కెత్తుకున్నారన్నవైనం మిత్రులు చెబుతూంటే శరీరంలో అణువణువు కల్లుక్కుమంది ఆయన్ని చూడనందుకు. ఈ తరానికి వాడ్రేవు విశ్వేశ్వర వెంకటా చలపతి, ఆయన ధర్మపత్ని సత్యవతిగార్లను చూసిన సందర్భాలు లేవనుకుంటా. వీరిద్దరు వీరలక్ష్మీదేవి, చిన వీరభద్రుడి తల్లిదండ్రులు. పెద్దసంతానమంటున్న ఈ దంపతులు జీవధర్మాన్ని అనుసరించి వెళ్లిపోయిన తర్వాత ఆ పిల్లలకి పాండురంగ విఠల్ తల్లీ, తండ్రీ అయ్యారని ఆ కుటుంబంతో బాగా పరిచయమున్నవారు చెబుతూంటే చీముపట్టిన గాయం మరింత సలపరించింది. భార్య తోబుట్టువు ప్రేమవివాహాన్ని పాండురంగ విఠల్ తన బాధ్యతగా తీసుకున్నా రనితెలిసి వీరభద్రుడు బాగా చదువుకున్నాడనే నా అసూయకు తోడు ఈయనకి బావమరిది కూడా అయ్యాడనే ఈర్ష్య కూడా ఒకింత పెరిగింది. విఠల్‌మిమ్మల్నీ కలుసుకోలేదు కానీ, ఇక ఎవరినీ కవలకుండాఉండను అనే మాట ఇస్తున్నాను.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

అమెరికా పర్యటన మరవలేనిది

సీపీఐ ఏపీ రాష్ట్ర సమితి కార్యదర్శి కె. రామకృష్ణ ఇటీవల అమెరికా పర్యటనపై ఇచ్చిన ఇంటర్వ్యూ క్లుప్తంగా:

ప్ర: అమెరికా పర్యటన ఎలా ఉంది?

జ: అక్కడ అంతా తెలుగువాళ్లు కలిశారు. తానా సభల సందర్భంగా భారతదేశం నుంచి అనేక మంది ప్రముఖులు వచ్చారు. వారితోనూ కలిసి మాట్లాడాను. భారతదేశంలో ఎన్నికల సంస్కరణలపై ఏర్పాటుచేసిన సెమినార్‌లో పాల్గొన్నాను. డల్లాస్‌లో నాలుగురోజులు, వాషింగ్టన్ డీసీ, వర్జీనియాలో అనేకమంది బంధుమిత్రులను కలుసుకుని మాట్లాడాను. 2019లో అమెరికా వచ్చానుకానీ, ఇంతమందిని కలవలేదు. అనేకమంది తమ ఇళ్లకు పిలిచి సత్కరించారు. ఇది మరువలేని అనుభవం.

ప్ర: ఏపీలో పరిస్థితి ఏమిటి?

జ: ఏపీలో వైసీపీ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లుగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమం చేయలేదు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. వ్యవసాయం, ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి లేదు. విద్యావిధానం అంతంత మాత్రమే. యూనివర్సిటీల్లో సిబ్బంది లేరు. యూనివర్సిటీలను నడిపే పరిస్థితి కూడా లేదు. రానున్న కాలంలో రాష్ట్రంలో గడ్డుపరిస్థితి ఏర్పడేట్టు ఉంది.

ప్ర: చాలామంది విద్యార్థులకు ఆర్థికసహాయం, వలంటీర్లు ఇళ్లవద్దకే వెళ్లి వృద్ధాప్య పెన్షన్‌లు ఇవ్వడం, ఇంకా ఇతర అనేక సౌకర్యాలు కల్పించడంపై ఏం చెబుతారు?

జ: అమ్మ ఒడి సహాయం ఇస్తే విద్యార్థులు పెరగాలిగానీ, ఎందుకు పెరగడంలేదు? ఒక్క టీచర్ ఐదు క్లాసులు బోధించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిస్తే చదువురాదని లక్షలాదిమంది విద్యార్థులను తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. లేదా కార్పొరేట్ స్కూళ్లకు పంపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మేలుగా ఉంటే ఇది ఎందుకు జరుగుతుంది? అని అన్నారు.

ప్ర: ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారు కూడా ప్రైవేటు స్కూళ్లలో చదివినవారితో సమంగా ఇంగ్లీషు మాట్లాడగలుగుతున్నారు. ఇది వాస్తవం కాదంటారా?

జ: ఇంగ్లీషు మీడియం ఏర్పాటు, నాడు-నేడు కింద స్కూలు భవనాల నిర్మాణం, మరికొన్ని స్కూలు భవనాలను మరమ్మత్తు చేయడం నిజమే. అయితే స్కూళ్లలో టీచర్లు ఉండడంలేదు. కాలేజీల్లో లెక్చరర్లు ఉండడంలేదు. ఎవరైతే భజనపరులు ఉన్నారో, వాళ్లకు వైస్‌ఛాన్సలర్ పదవులు దక్కుతున్నాయి. సమర్థులైన టీచర్లు ఉండటం లేదు. ఏపీలో ఏ యూనివర్సిటీకైనా జాతీయస్థాయి ర్యాంకు రాలేదు కదా! గతంలో ర్యాంకులు పొందిన యూనివర్సిటీల సామర్థ్యం కూడా పడిపోయింది. ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి.

ప్ర: నిరుద్యోగంపై ఏం చెబుతారు?

జ: దేశవ్యాప్తంగా పట్టభద్రులు 17శాతం నిరుద్యోగులుంటే, ఏపీలో 35శాతం ఉన్నారు. ఎందుకంటే, రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన సక్రమంగా లేదు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలివ్వడంలేదు. ప్రైవేటురంగంలో లేవు. కొత్త పరిశ్రమలు రావడంలేదు. ఇక్కడ ఉన్న కొన్ని పరిశ్రమలు కూడా ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి. అమరరాజా లాంటి ఫ్యాక్టరీలు వెళ్లిపోయాయి. విశాఖపట్నంలోనూ చాలా పరిశ్రమలు వెళ్లిపోయాయి. ఐటీ రంగంలోనూ మనం వెనుకబడి ఉన్నాము. తెలంగాణలో 2022, 2023లో ఐటీ ఉత్పత్తులు 1,80వేల కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయి. ఏపీ నుండి 0.14శాతం మాత్రమే ఎగుమతులు జరిగాయి. పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడంలేదు. ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో అంతుబట్టడంలేదు. ఇరిగేషన్‌రంగం వెనుకబడింది. గత నాలుగేళ్లలో అదనంగా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు.

ప్ర: అమరావతి రాజధానిపై మీ స్పందన ఏమిటి?

జ: విజయవాడ సమీపంలో రాజధాని కావాలని సీపీఐ పార్టీ తరఫున స్పష్టంగా చెప్పాం. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని అని అసెంబ్లీలోనే స్పష్టం చేశారు. అమరావతి రాజధాని అని చెప్పినప్పుడు సీపీఐ సంపూర్ణంగా స్వాగతించింది. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మాటమార్చి మూడు రాజధానులు అని మాట్లాడారు. రాజధానికి 30వేల ఎకరాలు అవసరమేనని ఆనాడు చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మాటమార్చి 30వేల ఎకరాలు ఎందుకని అంటున్నారు. మూడు ముక్కలాట ఆడుతున్నారు. కర్నూలు న్యాయరాజధాని అని చెప్పారు. ఇంతవరకు ఏ ప్రయత్నమూ లేదు. ఇది పక్కా మోసం. కులద్వేషంతో పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రిస్థాయికి ఇది తగదు. విశాఖపట్నం రాజధానిగా కూడా మార్పుచేయలేదు. ఎందుకంటే అక్కడి ప్రజలు కూడా హర్షించడం లేదని అన్నారు.

ప్ర: పెత్తందారీ వ్యవస్థ అని అంటున్నారేమిటి?

జ:భారతదేశంలో అత్యంతసంపదఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. నేను క్లాసువార్ నడుపుతున్నానా అంటాడు. ఇప్పటికే ఆయన అవినీతిపరుడని ఆయనమీద కేసులున్నాయి. ఒకసారి జైలుకు వెళ్లివచ్చారు. ఇప్పుడు అవినీతికి వ్యతిరేకమంటున్నారు. ఒక కులాన్ని టార్గెట్‌చేసి రాజకీయంగా లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సరైందేనా?

ప్ర: రానున్న ఎన్నికల్లో మీ వైఖరి ఏమిటి?

జ: ఏపీ కంటే ముందు తెలంగాణలో ఎన్నికలువచ్చే అవకాశం ఉంది. మా పార్టీ జాతీయస్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ఇతర పార్టీలతో పొత్తులు ఏర్పాటుచేసుకుని పోటీచేస్తుంది. నూతనంగా ప్రతిపక్షాలు ఏర్పాటు చేసుకున్న కూటమి ఇండియాతో కలిసి పోటీచేసే అవకాశం ఉంటుంది. ఇండియా సమావేశాలకు మా పార్టీ హాజరైంది. ముంబైలో జరిగే సమావేశానికి కూడా మా పార్టీ నాయకులు హాజరవుతారు. బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలనేది మా లక్ష్యం. ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు గురించి టీవీల్లో తరచుగా వస్తోంది. పులివెందులలో చిన్నపిల్లవాడు కూడా ఎవరు చంపారనేది చెపుతాడు. కేసుల వలన రాష్ట్రానికి కేంద్రం అన్యాయంచేసినా కూడా జగన్‌మోహన్‌రెడ్డి ఏమీ స్పందించడంలేదు.

ప్ర: కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని ఓడించాలంటున్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్, బీజేపీ కలిసి పోటీచేస్తాయని చెపుతున్నారు. నిజమేనా?

జ: అవన్నీ చర్చనీయాంశాలే. మా పార్టీకి సంబంధించి జాతీయస్థాయి కార్యవర్గంలో అన్ని అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటాము. ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఓడిపోవాలన్నదే మా వైఖరి.

ప్ర: రాయలసీమ అభివృద్ధిపై మీ వైఖరి ఏంటి?

జ: ఈ నాలుగేళ్లలో రాయలసీమలో అభివృద్ధి ఏమీజరగలేదు. కడపజిల్లాలో స్టీలు ఫ్యాక్టరీకి నాలుగుసార్లు శంకుస్థాపన చేశారు. ఈ సారి ఎవరూ నమ్మడంలేదు. మూడవసారి, నాల్గవసారి జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. మూడేళ్లలో ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఇప్పుడక్కడ ఏమీ జరగడంలేదు.

ప్ర: కమ్యూనిస్టులంటే ప్రజలకోసం పోరాడేవారని అంటారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఉందా?

జ: ప్రజల అభిప్రాయాలు సహజంగా మారుతుంటాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా నూతన ఆర్థికవిధానాలు వచ్చిన నేపథ్యంలో అనేకమార్పులు చోటుచేసుకున్నాయి. వామపక్షాలకు గడ్డుకాలం ఉన్న పరిస్థితి నిజమే. ఈ పరిస్థితిపై చర్చించి నేటి పరిస్థితులకు అనుగుణంగా పార్టీ విధానాలపై నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది.

భారత సాహిత్య అరుణతార అరసం

పెనుగొండ లక్ష్మీనారాయణ

భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు, ప్రాంతాలకు, అన్ని భాషలకు ప్రాతినిధ్యం వహిస్తూ 1936లో ఆవిర్భవించిన అఖిల భారత అభ్యుదయ రయిచతల సంఘం. ఈ సంస్థ 18వ జాతీయ మహాసభలు 2023, ఆగస్టు 20,21,22 తేదీలలో మధ్య ప్రదేశ్‌లోని ముఖ్యపట్టణమైన జబల్పూర్‌లో జరుగుతున్నాయి. ఈ మహాసభల నేపథ్యంలో అరసం ఆవిర్భావ వికాసాలను వివరించవలసిన అవసరముంది. అరసంది విశిష్ట చరిత్ర. అంతర్జాతీయ, జాతీయ పరిణామాలు, ప్రభావాల ఆధారాలతో ఏర్పడిన సంస్థ. 1932లో అహమ్మద్ ఆలీ, సజ్జాద్ జహీర్, రషీద్ జహాన్, మహమూద్ ఉన్ జాఫర్‌లు 9 కథానికలు, ఒక ఏకాంకికతో వెలువరించిన 'అంగారే' అనే ఆధునిక, అభ్యుదయభావాల సంపుటిని ఆనాటి యునైటెడ్ ప్రావిన్స్ ప్రభుత్వం నిషేధించింది. ఈ రచయితలు క్షమాపణ చెప్పటానికి నిరాకరించారు. ఏ విషమపరిస్థితులనైనా ఎదుర్కోటానికి సిద్ధపడ్డారు. ఈ దశలో సజ్జాద్ జహీర్‌ను 1933లో న్యాయవాద విద్య అభ్యసించటానికై తన తండ్రి లండన్‌కు పంపించారు. జహీర్ లండన్‌లో మహమ్మద్ దిన్, తసీర్ ముల్కరాజ్ ఆనంద్, జ్యోతిర్మయి ఘోష్, ప్రమోద్ రంజన్‌సేన్ గుప్తాలతో కలిసి ఒక సాహిత్యబృందాన్ని ఏర్పాటు చేశారు. అందులో హజ్రా బేగం వంటి మహిళలూ ఉన్నారు. జహీర్ ఆమోద విప్లవ కమ్యూనిస్టు బృందాలతో కూడా సంబంధాలు నెలకొల్పుకున్నారు. లండన్‌లో భారతీయ అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ప్రోత్సాహం ఈ బృందం ద్వారా జహీర్‌కు లభించింది. మంచి విషయం ఏమిటంటే ఈ బృందంలో లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలలో విద్యనభ్యసించే భారతీయ విద్యార్థులు ఎక్కువగా చేరారు. వీరంతా 1934, నవంబరు 24న లండన్‌లో చైనావారు డెన్మార్క్ వీధిలో నిర్వహించే నాన్‌కింగ్ రెస్టారెంట్‌లో తొలి సమావేశం జరుపుకున్నారు. ఆ సమావేశంలో ఏర్పాటైన అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా ఆనంద్, కార్యదర్శిగా సేన్‌గుప్త ఎంపికయ్యారు. 1935లో ముల్కరాజ్ ఆనంద్ పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ రచయితల సంఘం మహాసభకు హాజరైనారు. సభలో గోర్కీ, రాల్ఫ్ పాక్స్ క్రిస్టోఫర్ కాడ్వెల్, తదితర అంతర్జాతీయ రచయితలు పాల్గొన్నారు. 1935లో సజ్జాద్ జహీర్, ఆనంద్, సేన్‌గుప్తా, జ్యోతిఘోష్‌లు లండన్‌లో అభ్యుదయ రచయితల సంఘం ప్రణాళికను తయారుచేశారు. ఈ ప్రణాళికను భారత్‌లోని అభ్యుదయ రచయితలు కె.ఎం.అస్రాఫ్, అబ్దుల్ అలీమ్, మొహమూద్ యుజ్ జాఫర్, రషీద్ జహాన్, హిరేన్ ముఖర్జీ, ప్రేమ్‌చంద్‌కు పంపారు. ప్రేమ్‌చంద్ ఆ ప్రణాళికను హిందీలోకి అనువదించారు.

ఆంగ్లంలో ఫిబ్రవరి 1936 లెఫ్ట్ రివ్యూ పత్రికలలో అచ్చయింది. ఈ ప్రణాళిక భారతదేశంలోని విద్యార్థులు, రచయితలలో విస్తృతంగా చొచ్చుకెళ్లింది. ఈ ప్రణాళికను చదివి స్ఫూర్తిపొంది మహాకవి శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ' కవిత రాసిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను. "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని కష్టజీవులకు, కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశిస్తూ స్వర్ణ వాద్యములు సంధానిస్తూ...' అంటూ ఆ ప్రణాళిక సారాంశాన్ని ఈ కవిత ద్వారా అందించారు. ఇది తెలుగు సాహిత్యంలో చారిత్రాత్మక విషయం. సజ్జాదీ జహీర్ 1935లో భారత్‌కు తిరిగి వచ్చిన తరువాత అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటుకు కృషిచేయడం ఆరంభించారు. తన సహచరుడు అహ్మద్ అలీతో కలిసి ఇప్పటి ఉత్తరప్రదేశ్, పంజాబ్ తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. అనేకమంది సాహితీ మూర్తులను కలిగారు. శాఖలను ఏర్పాటు చేశారు. 1936, ఏప్రిల్ 10న సజ్జాద్ జహీర్ నిరంతర కృషి ఫలితంగా వారి నాయకత్వంలో లక్నోలో జాతీయ అరసం ఏర్పడింది. జహీర్ కోరికమేరకు ప్రేమ్‌చంద్ అధ్యక్షత వహించారు. రిఫా ఇ అమెహాల్‌లో మహాసభ జరిగింది. ఆహ్వాన సంఘం కన్వీనర్ అహమ్మద్ సూకర్, అధ్యక్షులు చౌదరి మహమ్మూద్ అలీ రుడాల్వి నేతృత్వంలో ఈ మహాసభలు బాగా జరిగాయి. 'ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'గా, 'అంజుమన్ తరక్కి పసంద్ ముసాన్నిఫిన్'గా అవిర్భవించిన ఈ మహాసంస్థకు సజ్జాద్ జహీర్ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికయ్యారు. 'హిందీలో ప్రగతి శీల్ లేఖక్ సంఘ్'గా అరసం ప్రసిద్ధిచెందింది. ఈ మహాసభలో ఆమోదించిన ప్రణాళికలలో అనేక విశిష్ట విషయాలున్నాయి. అందులో "చిరకాలంగా యథాతథ వాదుల చేతుల్లోపడి కునారిల్లిపోయిన సాహిత్యాన్ని, కళలను పరిరక్షించి వాటిని ప్రజలకు చేరువచేయడం, వాటిని జీవిత వాస్తవిక చిత్రీకరణకు ఉపయోగించే కీలకమైన ఉపకరణాలుగామార్చడం, మనం ఆకాంక్షిస్తున్న భవిష్యత్తు వైపు నడిపించడం, ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛకోసం పోరాడటంవంటి లక్ష్యాలను పేర్కొన్నారు. 1943లో బొంబాయిలో, 1980 అక్టోబర్‌లో జబల్పూర్‌లో జరిగిన మహాసభలలో నూతన ప్రణాళికలను జాతీయ అరసం రూపొందించుకుంది. అయితే మారిన అంతర్జాతీయ, జాతీయ పరిణామాల నేపథ్యంలో నిత్యనూతనమైన మరొక ప్రణాళికను అరసం రూపొందించుకోవలసిన అవసరముంది.

(అఖిల భారత అరసం జాతీయ మహాసభలు 2023, ఆగస్టు 20-22 తేదీల్లో జరగనున్న సందర్భంగా)

ఇప్పటివరకు అరసం 17జాతీయ మహాసభలను నిర్వహించుకుంది. 1938, డిసెంబరు 24,25 తేదీలలో జరిగిన ద్వితీయ మహాసభలను నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్‌ఠాగూర్ ప్రారంభించడం విశేషం. 1949, మే 27-29 తేదీలలో బొంబాయిలో నాలుగవ మహాసభలు జరగాల్సిఉండగా ప్రభుత్వం అనుమతించనుందువలన అక్కడికి 40మైళ్ల దూరంలోని భివాండి అనే చిన్న పట్టణంలో నిర్వహించారు. అరసం నిర్మాణంలో సజ్జాద్ జహీర్ అతని మిత్రబృందం చేసిన కృషి మరువలేనిది. అలాగే ఎందరో ముస్లిం సాహితీవేత్తలు కృషి చిరస్మరణీయం. పి.సి.జోషి, ముల్కరాజ్ ఆనంద్, భీష్మ సహాని, కిషన్‌చందర్, రాంవిలాస్ శర్మ, రాజీవ్ సక్సేనా, ఖగేంద్ర ఠాకూర్, నాముపరే సింగ్, కమలా ప్రసాద్, ఆలీ జావేద్ వంటి భారత జాతీయ రచయితలు అరసంలో ప్రధాన బాధ్యతలు నిర్వహించి అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జబల్‌పూర్‌లో జరుగుతున్న ఈ మహాసభలకు క్యూబా, నేపాల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి ప్రతినిధివర్గాలు వీసా సమస్యలు లేకుండా తప్పకవచ్చే అవకాశాలున్నాయి.

మహాసభల వివరాలు

ఈ మహాసభలు విస్తృత ప్రాతిపదికపై జరుగనున్నాయి. మహాసభలు జరిగే ప్రాంగణానికి ప్రసిద్ధ హిందీసాహిత్యవేత్త హరిశంకర్ పరాశయ్ శత జయంతిని పురస్కరించుకుని వారి పేరునుపెట్టారు. (నిర్వహించే వేదిక: రాగే రాఘవ హాల్). మహాసభలను ప్రముఖ సాహితీవేత్త, మహిళా హక్కుల ఉద్యమంలో విద్యారంగంలో విశేషకృషి చేస్తున్న సాయిడిన్ హమీద్ ప్రారంభిస్తారు. ఈమెను భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది కూడా. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈ సందర్భంగా జబల్‌పూర్‌నగరంలో రచయితల మహాప్రదర్శనను నిర్వాహకులు ఏర్పాటుచేశారు. మహాసభలలో అనేక వర్తమాన అంశాలు చర్చకు రానున్నాయి. భారతదేశంలో ప్రజాస్వామ్యా నికి, భావస్వేచ్ఛకు కలుగుతున్న విఘాతాలను నిరసిస్తూ రాజ్యాంగపరిరక్షణ కొరకు ఉద్యమించడం, దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా సాంస్కృతిక వ్యక్తీకరణ, మంచి వ్యవస్థనిర్మాణంలో సాహిత్యం పాత్రపైనా ఇంకా మరికొన్ని అంశాలపై సదస్సులతోపాటు సీనియర్ సాహితీవేత్తలతో యువరచయితల ఇష్టాగోష్ఠి కూడా ఏర్పాటైంది. మూడురోజుల పాటు ప్రజానాట్యమండలివారి గేయాలాపన, సాంస్కృతిక ప్రదర్శనలు ఉన్నాయి. ఈ మహాసభకు 80 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ నుంచి 20మంది, తెలంగాణ నుంచి 10మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ మహాసభలు మనదేశ సాహిత్యంలో నూతనోత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపుతాయని ఆశ. ఆకాంక్ష.

అరసం జాతీయ కార్యదర్శి

మణిపూర్‌లో మళ్లీ హింస

దుండగుల కాల్పుల్లో ముగ్గురి మృతి

ఇంఫాల్ : జాతి ఘర్షణలతో అట్టుడుకుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో హింస కొనసాగుతోంది. తాజాగా జరిగిన హింసాకాండలో ఉఖ్రుల్ జిల్లాలోని కుకి థోవై గ్రామంలో శుక్రవారం భారీ కాల్పుల నేపథ్యంలో ముగ్గురు యువకుల మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు లిటన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామం నుంచి తెల్లవారుజామున భారీ కాల్పుల శబ్దాలు వినిపించాయన్నారు. చుట్టుపక్కల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించగా 24 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు యువకుల మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. ఆ ముగ్గురి మృతదేహాలపై పదునైన కత్తులతో చేసిన గాయాల గుర్తులు ఉన్నాయని, వారి అవయవాలను కూడా నరికివేసినట్లు అధికారులు తెలిపారు షెడ్యూల్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతేయి కమ్యూనిటీ డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో 'ఆదివాసి సంఘీభావ యాత్ర' నిర్వహించిన తర్వాత మే 3న ఈశాన్య రాష్ట్రంలో జాతి ఘర్షణలు చెలరేగాయి.

ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ఉంది

ప్రధానికి కుకీ ఎమ్మెల్యేల లేఖపై మణిపూర్ సీఎం

ఇంఫాల్ : ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా మాట్లాడే అర్హత ఉందని ముఖ్యమంత్రి ఎన్‌బిరెన్ సింగ్ శుక్రవారం నొక్కి చెప్పారు ఈశాన్య రాష్ట్రంలోని కుకీలు అధికంగా ఉండే కొండ ప్రాంతాలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, డీజీపీ కావాలని మణిపూర్‌లోని కుకీ ఎమ్మెల్యేలు ప్రధాని నరేంద్ర మోదీని అభ్యర్థించిన కొద్ది రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు బీజేపీకి చెందిన ఏడుగురు సహా 10 మంది కుకీ ఎమ్మెల్యేలు బుధవారం ప్రధాని మోదీకి వినతి పత్రం సమర్పించారు. జాతి ఘర్షణలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలోని ఐదు కొండ జిల్లాల్లో 'సమర్థవంతమైన పరిపాలన' ఉండేలా 'ప్రధాన కార్యదర్శి, డీజీపీకి సమానమైన పోస్టులు' ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. వారు ఈ డిమాండ్‌ను లేవనెత్తిన ఐదు జిల్లాలు చురాచంద్‌పూర్, కాంగ్‌పోక్పి, చందేల్, తెంగ్నౌపాల్, ఫేర్జాల్. 'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా మాట్లాడటానికి అర్హులు' అని ముఖ్యమంత్రి సద్భావనా దివస్ సందర్భంగా ఇక్కడ విలేకరులతో అన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఎవరూ మీడియాతో మాట్లాడలేదు. 'కుకి-జో తెగలకు చెందిన ఐఏఎస్, ఎంసీఎస్, ఐపీఎస్, ఎంపీఎస్ అధికారులు తమ విధులను నిర్వర్తించలేకపోతున్నారు...' అని కుకీ ఎమ్మెల్యేలు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు నెలలుగా కొనసాగుతున్న జాతి కలహాల కారణంగా తమ ఇళ్లు, జీవనోపాధిని కోల్పోయిన సమాజానికి చెందిన ప్రజల పునరావాసం కోసం ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి రూ.500 కోట్లు, అలాగే, మణిపూర్‌లోని గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక పరిపాలన ఏర్పాటు చేయాలని గతంలో 10 మంది ఎమ్మెల్యేలు ప్రధాని మోదీని కోరారు. కొన్ని అపార్థాలు, స్వార్థ ప్రయోజనాల చర్యలు, దేశాన్ని అస్థిరపరిచేందుకు విదేశీ కుట్రలు రాష్ట్రంలో విలువైన ప్రాణాలను, ఆస్తులను కోల్పోయేలా చేశాయని బీరెన్ సింగ్ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో అన్నారు.

టమాటా, అరటి...ఇప్పుడు యాపిల్

న్యూఢిల్లీ : టమాటా, అరటి పండ్ల తర్వాత ఇప్పుడు యాపిల్ పండ్ల వంతు వచ్చింది. హిమాచల్ ప్రదేశ్‌లో కుండపోత వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం కారణాల వలన యాపిల్ పండించే ప్రాంతాలపై ప్రభావం పడటంతో యాపిల్ ధర మరింత ప్రియం కానున్నది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సరఫరా అంతరాయాల వలన వినియోగదారులు గత ఏడాదితో పోలిస్తే యాపిల్ ధరలలో 20-25 శాతం పెరుగుదలను చవిచూడనున్నాయి. కీలకమైన యాపిల్ పండించే ప్రాంతాలు ప్రభావితమవ్వడం వలన సిమ్లా, కులు-మనాలి, జమ్మూకశ్మీర్ వంటి ప్రాంతాలు తమ ఉత్పత్తులను మార్కెట్‌లకు రవాణా చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. కొండచరియలు విరిగిపడటం వల్ల చెట్లు నేలకొరిగాయి. పండ్లు దెబ్బతిన్నాయి. సరఫరా తగ్గి... ధరలు పెరిగాయి. యాపిల్ ధరలు ఇప్పటికే గత కొన్ని వారాల్లో కిలోకు దాదాపు రూ.120 నుంచి రూ.200 కి పెరిగాయి. హిమాచల్‌లో కొండచరియలు విరిగిపడటం వల్ల యాపిల్‌లను రవాణా చేసే అనేక టెంపోలు మార్గంలో చిక్కుకుపోయాయి. దీని వల్ల అనేక పండ్లు కుళ్లిపోయాతున్నాయని రైతులు వాపోతున్నారు.

రేపు కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష

న్యూఢిల్లీ: కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష - సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటీఈటీ) ఆగస్ట్ 20 ఆదివారం జరగనుంది. దీనికి సంబంధించిన హాల్ టికెట్లను విడుదల చేశారు. ఈ పరీక్షను సీబీఎస్ఈ నిర్వహిస్తుంది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్ సైట్ నుంచి తమ హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష జరుగుతుంది. మొదటి షిఫ్ట్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2. 30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి రెండు గంటల ముందే చేరుకోవాలి. ఉదయం షిఫ్ట్ పరీక్ష కోసం ఉదయం 7.30 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ కోసం 12.30 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకుని రిపోర్ట్ చేయాలి. ఆ తరువాత రిపోర్ట్ చేసేవారిని పరీక్ష రాయడానికి అనుమతించరు. దివ్యాంగులకు 50 నిమిషాల సమయం అదనంగా ఇవ్వబడుతుంది. ప్రధానంగా ఈ పరీక్ష పేపర్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉంటుంది. అభ్యర్థులు పరీక్ష హాల్లోకి కాలిక్యులేటర్లు, కాగితం ముక్కలు, ఇతర పత్రాలు, జామెట్రీ బాక్స్, రైటింగ్ ప్యాడ్, ఇరేజర్, లాగ్ టేబుల్, కార్డ్ బోర్డ్ తీసుకెళ్లరాదు. మొబైల్ ఫోన్, ట్యాబ్, బ్లూటూత్ డివైజెస్, ఇయర్ ఫోన్స్, మైక్రో ఫోన్స్, కెమెరా, పేజర్, స్మార్ట్ వాచ్, హెల్త్ బ్యాండ్, రిస్ట్ వాచ్, వాలెట్, గాగుల్స్, హ్యాండ్ బ్యాగులు, బంగారు లేదా ఇతర ఆభరణాలు, కాపీయింగ్ కు ఉపయోగపడే వేరే ఏ ఇతర వస్తువులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.

'నలభై శాతం కమీషన్'పై న్యాయ విచారణ

కర్నాటక ప్రభుత్వం ఆదేశాలు

బెంగళూరు : కర్నాటకలో గతంలో బీజేపీ నేతృత్వంలోని హయాంలో ప్రజా ప్రాజెక్టులకు '40 శాతం కమీషన్' డిమాండ్‌కు సంబంధించి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల తర్వాత, అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేసిన కీలక వాగ్దానాలలో ఒకదానిని నెరవేరుస్తూ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్ దాస్ నేతృత్వంలోని విచారణ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం, పెద్ద ఎత్తున ప్రజా పనులు చేపట్టిన శాఖల కార్యకలాపాలపై ఈ ప్యానెల్ ఆరా తీస్తుంది. అన్ని ప్రజా ప్రాజెక్టులపై 40 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని కర్నాటక రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం ప్రధాన మంత్రితో పాటు అప్పటి సీఎంకు లేఖ రాసింది. పనులు ప్రారంభించకముందే ప్రజాప్రతినిధులకు 25 నుంచి 30 శాతం కమీషన్ అందజేస్తుండగా, పనులు పూర్తయిన తర్వాత మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తున్నట్లు వివరించారు. 'అయితే, ఈ తీవ్రమైన ఆరోపణలపై ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం ప్రారంభ స్థాయిలోనే పరిపాలనలో పారదర్శకతను తీసుకురావాలని కోరుకుంటోంది' అని ఉత్తర్వులు పేర్కొన్నాయి. నిబంధనలు, పనుల నాణ్యత ప్రకారం పరిపాలనా అనుమతులు ఇచ్చారా లేదా అనే దానిపై ప్యానెల్ దర్యాప్తు చేస్తుంది. అంచనాలు ప్రస్తుతం ఉన్న రేట్ల షెడ్యూల్‌కు అనుగుణంగా ఉన్నాయో లేదో, పెరిగిన సందర్భంలో అంచనాలను సవరించాల్సిన అవసరాన్ని కూడా దర్యాప్తు ప్యానెల్ నిర్ధారిస్తుంది. విచారణ సందర్భంగా సంబంధిత శాఖలు తమ ఫైళ్లను ప్యానెల్‌కు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. ఎన్నికల ప్రచారంలో బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసేందుకు కాంగ్రెస్ '40 శాతం కమీషన్' అంశాన్ని లేవనెత్తింది.

అభివృద్ధి దిశగా అడుగులు వేద్దాం

బీజేపీ జెడ్పీ సభ్యులకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ : 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలంటే ప్రతి గ్రామం, తహసీల్, జిల్లాలో అభివృద్ధి దీపం వెలిగించాలని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు కృషి చేయాలని బీజేపీ 'జిల్లా పంచాయతీ' సభ్యులను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కోరారు. గుజరాత్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌తో సహా అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన స్థానిక సంస్థల సభ్యుల 'క్షేత్రీయ పంచాయతీ రాజ్ పరిషత్' ని ఉద్దేశించి ఆయన వర్చువల్ సమావేశంలో మాట్లాడుతూ 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' అనేది బీజేపీకి కేవలం నినాదం కాదని, వారు ప్రతి క్షణం జీవించాలని అన్నారు. దాదర్-నగర్ హవేలీ, డామన్-డయ్యూలో సమ్మేళనం జరుగుతుంది. ఇక్కడ ప్రధాని ప్రసంగం సమయంలో బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా కూడా ఉన్నారు. మొదట ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానిగా తనకున్న అనుభవాన్ని ఉటంకిస్తూ, స్థానిక సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న వారు తమ గ్రామాలు, జిల్లాల కోసం కొన్ని పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని, ప్రజల మద్దతు పొందడం ద్వారా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మోదీ అన్నారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే పేదలకు మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు వారికి బ్యాంకు ఖాతాలు తెరిపించాలని నిర్ణయించానని తెలిపారు. స్థానిక సంస్థలకు నిధులు చాలా రెట్లు పెరిగాయని, వనరులు అడ్డంకిగా లేవని గుర్తించి ప్రతి సంవత్సరం మూడు ప్రాజెక్టులను ప్రాధాన్యతగా చేపట్టేందుకు జిల్లా పంచాయతీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని ఆయన కోరారు. 'గతంలో గ్రాంట్ రూ.70 వేల కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.3 లక్షల కోట్లకు పైగా ఉంది. మేము 30 వేల కంటే ఎక్కువ జిల్లా పంచాయతీ భవనాలను నిర్మించాము' అని ఆయన అన్నారు. ఎంఎన్ఆర్ఈజీఏ బడ్జెట్‌లో కొంత భాగాన్ని ఆస్తుల సృష్టికి కూడా ఉపయోగించడాన్ని నొక్కి చెప్పారు. స్థానిక సంస్థలకు చెందిన బీజేపీ సభ్యులు ఇలాంటి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారని, ఎన్నికల్లో గెలుపొందడం కోసం కాదని, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి పార్టీ కృషి చేస్తుందన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన ప్రకటించిన విశ్వకర్మ పథకం గురించి మాట్లాడుతూ గ్రామాల్లోని సంప్రదాయ చేతివృత్తుల వారి జాబితాను తయారు చేసి, వారికి సహాయపడే మార్గాలను సూచించాలని పార్టీ కార్యకర్తలను మోదీ కోరారు. 'గ్రామ ఆర్థిక వ్యవస్థకు సహకరించే సంప్రదాయ కళాకారులు ప్రతి గ్రామంలోనూ ఉన్నారు. సామాజిక బాధ్యతగా తమ పని తాము చేసుకుంటారు. ప్రజలు సామరస్యంగా కలిసి జీవిస్తున్నందున ఇటువంటి సమాజాలు ఎటువంటి నేర కార్యకలాపాలను చూడవు. వారికి సాధికారత కల్పించాలనుకుంటున్నాం' అని అన్నారు. 'నైపుణ్యాభివృద్ధితో పాటు ఇతర శక్తివంతమైన సాధనాలను అందించ డంలో వారికి సహాయపడటానికి బడ్జెట్ కేటాయించాము. సెప్టెంబరు 17న జరిగే పెద్ద కార్యక్రమంలో ఈ పథకాన్ని పారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

విస్తారా విమానానికి బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ విమానాశ్రయంలో విమానం మరి కాసేపట్లో బయల్దేరడానికి సిద్ధంగా ఉంది. ఇంతలో విమానాశ్రయంలోని జీఎంఆర్ కాల్ సెంటర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ఆ విమానంలో బాంబు ఉందని, అది కాసేపట్లో పేలనుందని ఆ ఫోన్ చేసిన ఆగంతకుడు చెప్పాడు. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఈ ఫోన్‌కాల్ వచ్చింది. గేట్ నెంబర్ 42 వద్ద పార్క్ చేసి ఉన్న ఆ విమానంలో మూడు బాంబులు పెట్టామని, అవి ఒక గంటలో పేలనున్నాయని ఆగంతకుడు చెప్పాడు. వెంటనే కాల్ సెంటర్ స్టాఫ్ విమానాశ్రయ అధికారులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో, విమాన ప్రయాణాన్ని నిలిపివేసి, ప్రయాణికులను కిందకు దింపారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ ఆ విమానంలో తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ నుంచి పూనే వెళ్లాల్సిన విస్తారా ఎయిర్ లైన్స్ యూకే 971 విమానానికి సంబంధించి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఈ బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది.

విద్యార్థుల ఆత్మహత్యల నియంత్రణకు

కోటాలో కొత్త రకం ఫ్యాన్లు

కోటా: పోటీపరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్‌లోని 'కోటా'లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన స్థానిక యంత్రాంగం ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కోటాలోని అన్ని హాస్టళ్లు, పెయింగ్ గెస్ట్ (పీజీ) వసతుల్లో స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశించారు. ఐఐటీ, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది విద్యార్థులు కోటాకు వచ్చి శిక్షణ పొందుతారు. ఈ ఏడాది దాదాపు 2.5 లక్షల మంది అక్కడ శిక్షణ తీసుకుంటున్నట్లు అంచనా. అయితే, కొద్ది రోజులుగా ఇక్కడ తరచూ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం కలవరపరుస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ఎనిమిదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది కోటాలో ఆత్మహత్యల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ క్రమంలోనే కోటా జిల్లా యంత్రాంగం గతవారం సమావేశం నిర్వహించింది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు కీలక నిర్ణయాలు తీసుకుంది. మృతి చెందిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఫ్యాన్‌కు ఉరేసుకొని మరణించినట్లు గుర్తించిన అధికారులు... హాస్టళ్లు, పీజీ గదుల్లో తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశించింది. వాటి స్థానంలో స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. లోడ్‌ను గుర్తించిన క్షణంలోనే అన్‌కాయిల్ అయ్యేలా ఈ ఫ్యాన్లను తయారుచేశారు. ప్రస్తుతం కోటాలోని హాస్టళ్లలో ఈ ఫ్యాన్లను శరవేగంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు కోచింగ్ సంస్థలు కచ్చితంగా విద్యార్థులకు వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. ఒక తరగతి గదిలో 80 మంది విద్యార్థులు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలు పాటించని హాస్టళ్లు, పీసీ వసతులను వెంటనే మూసివేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర వాటాకు కేంద్రం నిరాకరణ

కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్

కాంగ్రెస్ సహాయ నిరాకరణపై ధ్వజం

తిరువనంతపురం : రాష్ట్ర పన్ను వాటా, రుణాల పరిమితిని తగ్గించినందుకు కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ శుక్రవారం కేంద్రంపై ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అర్హమైన ప్రయోజనాలను పొందడానికి ప్రతిపక్ష యూడీఎఫ్ ఎంపీలు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించడం లేదని ఆరోపించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అన్ని రంగాలలో సహాయాన్ని అందజేస్తుందని హామీ ఇచ్చిందని, ఓనం సీజన్‌లో సుమారు రూ.19 వేల కోట్లు ఖర్చు చేయాలని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రభుత్వం అన్ని రంగాల్లో సాయం అందేలా చూస్తోందని, సాంఘిక సంక్షేమ పింఛన్‌ను ఇప్పటికే అందజేశామని అన్నారు. కేరళపై ఆర్థిక ఆంక్షలు విధించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ గాంధీ నేతృత్వంలోని యూడీఎఫ్ ఎంపీలు రాష్ట్రానికి ఏమీ చేయడం లేదని బాలగోపాల్ ఆరోపించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఎంపీలు ఏకతాటిపై నిలబడతామని అంగీకరించినప్పటికీ, వారెవరూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి ఇటీవల ఆమెకు సమర్పించాల్సిన వినతి పత్రంపై సంతకం చేయడానికి అంగీకరించలేదని మంత్రి ఆరోపించారు. ఇటీవల ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇక్కడ ఏర్పాటు చేసిన ఎంపీల సదస్సులో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ఐక్యంగా ఉండేందుకు తమ మద్దతు ఉంటుందని కాంగ్రెస్ ఎంపీలు హామీ ఇచ్చారని తెలిపారు. అయితే యూడీఎఫ్‌కు చెందిన 18 మంది లోక్‌సభ ఎంపీలు లేదా వారి రాజ్యసభ సహచరులు కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను అంచనా వేయడానికి, రాష్ట్ర బకాయిలను విడుదల చేయాలని ఆమెపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు రాలేదని ఆయన ఆరోపించారు. కేరళపై ఆర్థిక ఆంక్షలు విధించే ప్రయత్నంలో యూడీఎఫ్ ఎంపీలు బీజేపీ ఆసక్తిని పంచుకున్నట్లు తెలుస్తోందని అన్నారు. ఆర్థిక విషయాల్లో కేరళ పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని ఖండించిన బాలగోపాల్... బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన కేటాయింపులు, వాటాలను తగ్గించి చేతులు దులుపుకుందని ధ్వజమెత్తారు. ఈ ముఖ్యమైన సమస్యపై రాష్ట్రానికి చెందిన యూడీఎఫ్ ఎంపీలు ఇప్పటివరకు ఏమి చేశారో తెలుసుకోవాలని కోరారు. 'రాష్ట్రానికి చెందిన ఒక్క యూడీఎఫ్ ఎంపీ కూడా వినతి పత్రంపై సంతకం చేయడానికి సిద్ధంగా లేరు. రాజకీయాలు లేవు. ఆర్థిక విషయాలే వినతి పత్రంలో ఉన్నాయి. ఎంపీలు కూడా ఆమెను కలవడానికి సిద్ధంగా లేరు' అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలను 'మోసం' చేస్తోందని కాంగ్రెస్‌పై అభియోగాలు మోపిన సీపీఎం సీనియర్ నాయకుడు... ప్రతిపక్ష ఎంపీలు కూడా ఈ విషయంలో బీజేపీ ప్రయోజనాలను పరిరక్షించేలా వ్యవహరిస్తున్నారా అని ప్రశ్నించారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష యూడీఎఫ్ అవలంబిస్తున్న విధానంలో ఎంపీల సహాయ నిరాకరణ భాగమేనా అని కూడా ఆయన నిలదీశారు. 'కేంద్రం కేటాయింపులను భారీగా తగ్గించినట్లయితే, అది రాష్ట్ర విద్య, ఆరోగ్య రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. భావితరం ప్రాథమిక హక్కులను కూడా రక్షించదు' అని ఆర్థిక మంత్రి అన్నారు.

లాలూ బెయిల్‌పై సుప్రీంకు సీబీఐ

న్యూఢిల్లీ: కిడ్నీ సంబంధిత సమస్య నుంచి కోలుకుంటున్న ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) షాకిచ్చింది. దాణా కుంభకోణం కేసుల్లో ఆయనకు మంజూరైన బెయిల్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీబీఐ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఆగస్టు 25న విచారించనుంది. దాణా కుంభకోణానికి సంబంధించిన అనేక కేసుల్లో జైలు శిక్ష పడిన లాలూ... ప్రస్తుతం బెయిల్‌పై బయటే ఉన్నారు. అనారోగ్య కారణాల రీత్యా ఝార్ఖండ్ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి విడుదలైన లాలూ గతేడాది డిసెంబరులో సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయన కుమార్తె రోహిణి తండ్రికి కిడ్నీ దానం చేశారు. ఆ ఆపరేషన్ తర్వాత లాలూ కోలుకున్నారు. ఇటీవల విపక్షాల ఉమ్మడి కూటమి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ క్రమంలోనే ఆయన బెయిల్‌ను సవాల్ చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అడ్డగోలు చార్జీలు వద్దు: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ : నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల వద్ద అప్పులు చేసి.. ఆ తర్వాత దివాలా తీసిన వారికి ఆర్‌బీఐ కొంత ఊరటనిచ్చింది. ఈ మేరకు తన పరిధిలో పని చేసే వాణిజ్య బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇతర రుణదాతలు లేదా రెగ్యులేటెడ్ సంస్థలు (ఆర్‌ఈ) జరిమానా రూపంలో వసూలు చేసే వడ్డీఈ విషయంలో సహేతుకంగా, పారదర్శకంగా ఉండాలని సూచించింది. రుణగ్రహీతలు చెల్లించలేని పరిస్థితులలో అనేక సంస్థలు నిబంధనలు ఆసరాగా చేసుకొని జరిమాన వడ్డీ రేట్లను సాధారణంగా కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు గుర్తించామని ఆర్‌బీఐ పేర్కొంది. జరిమానా వడ్డీ లేదా ఛార్జీలను కేవలం రుణ గ్రహీతల్లో క్రమశిక్షణ పెంచడానికి మాత్రమే వినియోగించాలని, అంతే కాని, అటువంటి వాటిని ముందుగా చేసుకొన్న ఒప్పందం రేటు కంటే మించి ఆదాయం పెంచుకొనే సాధకాలుగా వాడకూడదని ఆర్‌బీఐ హితువు పలికింది. ఈ సంస్థలు విధించే అత్యధిక వడ్డీరేట్లు వివాదాలు, ఫిర్యాదులకు దారి తీస్తున్నాయి అని ఆర్‌బీఐ విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం రుణ నిబంధనల ప్రకారం చెల్లింపులు చేయలేకపోతే జరిమాను చార్జీల రూపంలో మాత్రమే విధించాలి. అంతే కాని, ఈ చార్జీలపై భవిష్యత్తులో ఎలాంటి వడ్డీని విధించకూడదు. ఇది సాధారణ రుణాలపై విధించే చక్రవడ్డీకి వర్తించదని ఆర్‌బీఐ పేర్కొంది. అంతేకాదు... బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వడ్డీకి మరే ఇతర అదనపు భారాలను జోడించకూడదని తేల్చి చెప్పింది. ఈ మార్గదర్శకాల స్ఫూర్తిని అర్థం చేసుకొని పాటించాలని పేర్కొంది. తమ పరిధిలోని సంస్థలు జరిమాన వడ్డీ తదితర ఛార్జీల విధనాలను తయారు చేసి ఆమోదించేందుకు ఓ బోర్డు ఏర్పడనుంది. మంజూరు చేసిన రుణాల నిబంధన పరిధిలో జరిమానా ఛార్జీలు సహేతుకంగా ఉండేలా చూడనుంది.

వ్యక్తిగత, వ్యాపారేతర రుణాలపై విధించే అపరాధ రుసుములు వ్యక్తిగతేతర రుణాలపై విధించే పీనల్ ఛార్జీల కంటే తక్కువగా ఉండాలి. తాజాగా ఆయా సంస్థలు తాము రుణాలు మంజూరు చేసే సమయంలో అపరాధ రుసుముల స్పష్టంగా వెల్లడించాలని ఆర్‌బీఐ చెబుతోంది. అంతేకాదు ఆయా సంస్థలు తమ వెబ్‌సైట్లలో వీటిని వడ్డీ రేట్లు, సర్వీసు ఛార్జీల విభాగాల్లో ప్రదర్శించాలని చెబుతోంది. రుణ చెల్లింపులు చేయని పక్షంలో రుణగ్రహీతలకు రిమైండర్లు పంపాల్సి ఉంటుంది. చెల్లింపులు చేయకపోతే విధించబోయే పీనల్ ఛార్జీలను ముందుగానే రుణగ్రహీతలకు తెలియజేయాల్సి ఉంటుంది. అపరాధ రుసుం విధించిన సందర్భం, కారణం కూడా వివరించాలి. ఈ నిబంధనలు మొత్తం 2024 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

రిలయన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిస్టింగ్ తేదీ ఫిక్స్

ముంబై : రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) నుంచి విభజించిన ఆర్థిక సేవల విభాగం జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ స్టాక్ మార్కెట్లలో ప్రవేశానికి సిద్ధమైంది. ఆగస్టు 21న సంస్థ మార్కెట్లలో లిస్ట్ అవనుంది. ఈ మేరకు శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్ సందర్భంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది. ఆర్ఐఎల్ ఇటీవల తన వ్యాపార ఆర్థిక సేవల విభాగమైన రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను విభజించిన విషయం విదితమే. గత వారమే అర్హులైన ఆర్ఐఎల్ వాటాదారుల డిమ్యాట్ ఖాతాల్లోకి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లను జమ చేశారు. విభజన పథకం ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదార్లు తమ వద్ద ఉన్న ప్రతి షేరుకు ఒక జేఎఫ్ఎస్ఎల్ షేరును పొందారు. ఈ సందర్భంగా గత నెల 20న స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ప్రత్యే ప్రీ-ఓపెన్ సెషన్‌ను నిర్వహించి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు స్థిర విలువను రూ.261.85గా నిర్ధారించింది. అలా లెక్కించగా మార్కెట్ విలువ రూ.1,66,000 కోట్లుగా తేలింది. ఈ విలువ ప్రకారం దేశంలోనే రెండో అతిపెద్ద నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ ఇది.

మళ్లీ నష్టాల్లోనే సూచీలు

ముంబై :దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికాలో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లు పెంచుతుందన్న వార్తలు కొనసాగుతున్న వేళ అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. దీనీ ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. అయితే, జియో ఫైనాన్షియల్ షేర్ల లిస్టింగ్ తేదిని రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటించడంతో ఆఖర్లో ఆ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. దీంతో సూచీలు కాస్త రికవర్ అయ్యాయి. మొత్తంగా సెన్సెక్స్ 200 పాయింట్ల మేర నష్టపోగా... నిఫ్టీ 19,300 స్థాయి వద్ద నిలిచింది. ఉదయం 65,025.71 పాయింట్ల వద్ద సెన్సెక్స్ నష్టాల్లో ప్రారంభమైంది. అద్యంతం నష్టాల్లోనే కొనసాగింది. ఒక దశలో 400 పాయింట్ల మేర నష్టంతో ఇంట్రాడేలో 64,754.72 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకిన సూచీ... చివరికి 202.36 పాయింట్ల నష్టంతో 64,948.66 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 55.10 పాయింట్ల నష్టంతో 19,310.15 వద్ద స్థిరపడింది. లాభపడిన షేర్లు : అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, ఐచ్చర్ మోటార్స్, మారుతీ సుజూకీ, నెస్లే ఇండియా, బ్రిటానియా ఇండస్ట్రీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలివర్, టాటా మోటార్స్, ఐటీసీ, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్స్, దివీస్ ల్యాబ్స్. నష్టపోయిన షేర్లు : హీరో మోటోకార్ప్, కోల్ ఇండియా, టీసీఎస్, హిండాల్కో, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, విప్రో, ఓఎన్‌జీసీ, ఎం అండ్ ఎం, బజాజ్ ఫిన్‌సర్వ్. బంగారం ధరలు : 10 గ్రాముల బంగారం ధర రూ.175 పెరిగి... రూ.58,465 ఉండగా, కిలో వెండి ధర రూ.339 పెరిగి 70,357 వద్ద నిలిచింది. డాలరు రూపాయి మారకం విలువ రూ.83.23గా ఉంది.

పాలకుల నిర్లక్ష్యం

ఉత్తరాంధ్ర వెనుకబాటుపై రామకృష్ణ

మోదీ, జగన్‌ను గద్దె దించితేనే భవిష్యత్తని వ్యాఖ్య

విశాలాంధ్ర-శ్రీకాకుళం: కష్టజీవులు, నీరు, భూమి వంటి వనరులు పుష్కలంగా ఉన్నా అభివృద్ధిలో ఉత్తరాంధ్ర బాగా వెనుకబడిందని, ఇందుకు పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. 'రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ చేపట్టిన ప్రచారజాతా-బస్సుయాత్ర శుక్రవారం ఉదయం శ్రీకాకుళం నగరానికి చేరుకుంది. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సదస్సు జరిగింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యన్నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రం మెడలు వంచైనా ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలు సాధిస్తామని ఎన్నికల ముందు చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి...ఆ మాటలు మరిచి...అప్పుల కోసం ప్రధాని మోదీ కాళ్లపై పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని, ప్రజల కోసం పోరాటాలు చేస్తున్న వారిపై అక్రమకేసులు బనాయించి...రాష్ట్రంలో పోలీసు రాజ్యాన్ని వైసీపీ ప్రభుత్వం నడుపుతోందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉన్నాయని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్ట్ 2020 నాటికి పూర్తి చేస్తామని చెప్పిన సీఎం జగన్...అది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని ఇప్పుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. స్థానిక నాయకులలో చిత్తశుద్ధి ఉంటే ఉత్తరాంధ్ర ఎప్పుడో అభివృద్ధి చెందేదన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల కష్టాలను నాయకులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసి...వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నదని, అదానీ ఆస్తి పెరుగుదలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మోదీ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేకుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయటానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దారుణమని, అన్ని దేశాలు అణువిద్యుత్‌ను వ్యతిరేకిస్తున్నా జిల్లాలోని కొవ్వాడలో నిర్మాణానికి పూనుకో వడం మోదీకి రాష్ట్రంపై గల ప్రేమ అర్థమవు తోందని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీలను కేంద్రం పట్టించు కోవడం లేదన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను సాగనంపకపోతే భవిష్యత్తు తరాలకు తీవ్రప్రమాదం తప్పదని రామకృష్ణ హెచ్చరించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగం లోనే కొనసాగించాలని, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీమంత్రి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు సువిశాల సముద్ర తీరం, నదులు, పొలాలు ఉన్నా ఉపాధి లేక యువత ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే అన్న హామీ అమలు కావడం లేదని, కాలుష్య కారక పరిశ్రమలతో ఉత్తరాంధ్రను సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రాంతీయ బోర్డు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల శ్రేయస్సు కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటాల్లో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ మాట్లాడుతూ ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా నీరు ప్రధానమని, ఈ విషయం తెలిసినా సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని విమర్శించారు. పోలవరం పూర్తి చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకువస్తే ఈ ప్రాంతం అభివృద్ధి జరుగు తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. శ్రీకాకుళం నగరానికి చేరుకున్న బస్సుయాత్రకు సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి అధ్వర్యంలో సీపీఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ప్రజానాట్యమండలి బృందం ఆలపిం చిన ఉద్యమ గీతాలు అందరినీ అలరించాయి. అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షుడు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.విమల, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్య క్షుడు జాన్సన్ బాబు, సీపీఎం జిల్లా నాయకుడు బి.కృష్ణ మూర్తి, సీనియర్ పాత్రికేయులు శివశంకర్, నల్లి ధర్మారావు, అరసం నాయకులు అట్టాడ అప్పలనాయుడు, సీపీఐ జిల్లా సమితి, కార్యవర్గ సభ్యులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో దేశానికి ముప్పే

రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిన జగన్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-బెలగాం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో దేశానికి ముప్పు అని, ఈ విషయాన్ని ప్రజలందరూ గుర్తించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. 'దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి' నినాదంతో సీపీఐ ప్రచార జాత-బస్సు యాత్ర శుక్రవారం మన్యం జిల్లా పార్వతీపురం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక రాయగడ రోడ్డులో గల విజయలక్ష్మి కల్యాణ మండపంలో సీపీఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అధ్యక్షతన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి భద్రత ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయడానికి పూనుకున్నదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం దేశభక్తితో కూడుకున్నదన్నారు. దేశ వ్యాప్తంగా 26 రాజకీయ పార్టీలు ఒకే వేదిక పైకి వచ్చాయని తెలిపారు. ఏడాదికి 2 కోట్ల మంది యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని, ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు నల్లధనాన్ని పంచి పెడతానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోదీ... ఆ హామీలను గాలికొదిలి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వ విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఉపాధి లేక యువత ఆందోళన చెందుతున్నారని, వేతనాలు తగ్గి కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, దేశంలో ఆత్మహత్యలు పెరిగాయని, మహిళలపై దాడులు పెరిగాయని విమర్శించారు. పార్లమెంటులో అవిశ్వాసం ప్రవేశపెట్టేంత వరకు మణిపూర్ అల్లర్లపై ప్రధాని మాట్లాడలేదని, ఇప్పటి వరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదన్నారు. సంపన్నుల ఆదాయం పెరుగుతుండగా, పేదల ఆదాయాలు తగ్గుతున్నాయని చెప్పారు. దేశంలోని మీడియా ప్రధాని పరివారం అదానీ, అంబానీ చేతుల్లోకి వెళ్లిపోయిందని విమర్శించారు. దేశ ప్రజలను అబద్ధాలతో మోసగిస్తున్న మోదీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో రూ.9 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుపుకున్నా దేశంలో మార్పు రాలేదని, ఇక్కడి గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య, రవాణా, విద్యుత్ సౌకర్యాలు లేవని అన్నారు. ఇప్పటికీ డోలీల సమస్య తీరలేదని, వర్షా కాలం వస్తే డెంగీ, మలేరియాతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. దేశం ఎంతో అభివృద్ధి చెందిందని కానీ వాటి ఫలాలు డబ్బున్న వారికే దక్కుతున్నాయని, పేదలు... పేదలుగానే మిగిలిపోతున్నారని తెలిపారు. అందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతుందని ధ్వజమెత్తారు. ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నా కష్టాల్లో పేదవాడిని ఆదుకునే పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్సన్ బాబు, లెనిన్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర నాయక్, పెంచలయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు విమల, పార్వతీపురం మన్యం జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, ఈవి నాయుడు, పెద్ద సంఖ్యలో సీపీఐ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

అనకాపల్లిలో సుజల స్రవంతిపై రౌండ్‌టేబుల్ సమావేశం. సాయంత్రం నర్సీపట్నంలో రోడ్‌షో



అమేథి నుంచి రాహుల్ పోటీ: అజయ్ రాయ్

లక్నో: వచ్చే ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథి నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీ చేస్తారని ఆ పార్టీ నేత అజయ్ రాయ్ తెలిపారు. కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత శు క్రవారం తొలిసారి వారణాసి వెళ్లిన రాయ్ విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ కచ్చితంగా అమేథి నుంచి పోటీ చేస్తారని చెప్పారు. ఆయన వెంట అమేథి ప్రజలు ఉన్నారన్నారు. రాహుల్ సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎక్కడ నుంచి పోటీ చేయాలనుకున్నాగానీ ఆమె గెలుపే కార్యకర్తల లక్ష్యమని చెప్పారు. ఆమెను గెలిపించేందుకు పార్టీ వారు చేయగలిగినదంతా చేస్తారని, వారణాసి నుంచి పోటీ చేసినా సరే శాయాశక్తులు ఒడ్డుతారని రాయ్ అన్నారు. రాహుల్ గాంధీ దిల్లీకి రారన్న కేంద్రమంత్రి స్మృతిఇరానీ వ్యాఖ్యలపై స్పందిస్తూ 'స్మృతి ఇరానీ తన మాటపై నిలబడలేకపోతున్నారు. రూ.13కు కిలో పంచదార ఇస్తామన్నారుగానీ అలా చేయగలిగారా? ఆమె ప్రజలకు సమాధానం చెప్పాలి' అని రాయ్ వ్యాఖ్యా నించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, బీజేపీ సృష్టించిన భయోత్పాతమే అజెండాగా తమ పార్టీ ఎన్నికలకు వెళుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రేమ సందేశాన్ని ప్రజల్లోకి, ఉత్తరప్రదేశ్‌లోని ఇంటింటికి చేరుస్తామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై రాయ్ దీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో అమేథి (ఉత్తరప్రదేశ్), వాయనాడ్ (కేరళ) నుంచి రాహుల్ పోటీ చేశారు. అమేథిలో ఆయనపై 55వేల ఓట్లతో స్మృతి ఇరానీ గెలిచారు. పరువు నష్టం కేసు నేపథ్యంలో ఎన్నికల్లో రాహుల్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

బెంగళూరులో తొలి '3డీ పోస్టాఫీస్'

బెంగళూరు: దేశంలోనే తొలి 'త్రీడీ ప్రింటెడ్' పోస్టాఫీసు అందుబాటు లోకి వచ్చింది. కర్నాటక రాజధాని బెంగళూరులో నిర్మించిన ఈ తపాలా కార్యాలయాన్ని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. నిర్మాణ పనులు సాగిన తీరు, కార్యాలయంలోని సౌకర్యాలను చూపుతోన్న ఓ వీడియోను ఆయన ట్విటర్ వేదికగా పోస్టు చేశారు. 'ఆత్మనిర్భర్ భారత్ ' స్ఫూర్తికి ఈ 'త్రీడీ పోస్టాఫీస్' నిదర్శమని మంత్రి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం 'త్రీడీ పోస్టాఫీసు'పై స్పందిస్తూ... ప్రతి భారతీయుడు దీన్ని చూసి గర్వపడతాడని పేర్కొన్నారు. స్వావలంబన స్ఫూర్తిని ఇది ప్రతిబింబిస్తోందని ట్వీట్ చేశారు. ఇక్కడి కేంబ్రిడ్జ్ లేఅవుట్‌లో 1021 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీని నిర్మాణం చేపట్టారు. ఆధునిక 'త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ' సాయంతో కేవలం 45 రోజుల వ్యవధిలోనే పనులు పూర్తి చేయడం విశేషం. అదే సంప్రదాయ పద్ధతిలో నిర్మిస్తే దాదాపు ఎనిమిది నెలలు పడుతుందని అధికారులు చెప్పారు. మద్రాస్ ఐఐటీ సాంకేతిక సహకారంతో ఎల్ అండ్ టీ సంస్థ దీన్ని నిర్మించినట్లు వెల్లడించారు.

ఉమర్ బెయిల్‌పై విచారణ వాయిదా

న్యూదిల్లీ: జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖాలిద్‌కు ఉపా కేసులో బెయిల్‌పై విచారణను సర్వోన్నత న్యాయస్థానం వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను రెండు వారాల తర్వాత జాబితా చేయాలని జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ బి.త్రివేదిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఉమర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఈ ఉత్తర్వులకు అంగీకరించారు. విచారణ కోసం జాబితా అయిన కేసు మరోసారి వాయిదా పడటం గమనార్హం. ఈనెల 9న ఉమర్ కేసును జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ పీకే మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించాలిగానీ కేసు విచారణ నుంచి జస్టిస్ మిశ్రా తప్పుకోవడంతో దానిని మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఫలితంగా విచారణ ఈ నెల 17వ తేదీకి వాయిదా పడింది. 2020 , ఫిబ్రవరిలో దిల్లీలో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో ఉమర్‌ను చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

సూర్జేవాలాపై కేసు

న్యూదిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాపై కేసు నమోదైంది. బీజేపీ మద్దతు దారులనుద్దేశించి ఇటీవల చేసిన వ్యాఖ్యలా ధారంగా దిల్లీకి చెందిన సంజయ్ గుప్తా... రోహిణి పోలీస్ స్టేషన్‌లో సూర్జేవాలాపై ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని, సూర్జేవాలాపై విచారణ జరిపించాలని, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అయితే ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. హరియాణాలోని కైతాల్‌లో ఇటీవల జరిగిన జన్ ఆక్రోశ్ ర్యాలీలో సూర్జేవాలా మాట్లాడుతూ, బీజేపీకి ఓటేసిన వారు రాక్షస స్వభావులు, మహాభారతం జరిగిన నేలపై నుంచి వారిని శపిస్తున్నానని అన్నారు. సమాజాన్ని విద్వేష మంటలోకి నెట్టేసినవారు, యువత కలలను చంపేసినవారు రాక్షసుల కంటే ఏమైనా తక్కువా? అని ప్రశ్నించారు. యువతలకు ఉద్యోగాలు కల్పించడానికి బదులు కనీసం పరీక్షల్లో కూర్చునే అవకాశం ఇవ్వలేదని, పేపరు లీకులతో యువత భవిష్యతుతో చెలగాటమాడుతున్నారని బీజేపీని దుయ్యబట్టారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడ్డారు. రాక్షస కుటుంబంలో పుట్టినవారే ఇలా మాట్లాడతారని హరియాణా సీఎం మనోహర్‌లాల్ కట్టర్ విమర్శించారు.

జంట హత్యల కేసులో ప్రభునాథ్ దోషి: సుప్రీం

న్యూదిల్లీ: ఇరవై ఎనిమిది ఏళ్ల 1995) క్రితం జరిగిన జంట హత్యల కేసులో ఆర్జేడీ మాజీ శాసనసభ్యుడు, బీహార్ రాజకీయ నేత ప్రభునాథ్ సింగ్‌ను దోషిగా నిర్ధారించిన సుప్రీంకోర్టు... ఈ కేసులో పాట్నా హైకోర్టు 2008లో అతడ్ని నిర్దోషిగా విడుదల చేసిన తీర్పును రద్దు చేసింది. ఆగస్ట్ 23, 1995న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సింగ్ ఆదేశానుసారం ఓటు వేయని ఇద్దరు వ్యక్తులు రాజేంద్ర రాయ్, దరోగ రాయ్ ను చప్రాలో కాల్చి చంపారు. సాక్షులను బెదిరించి బలవంతం చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించడంతో కేసును ఛప్రా నుంచి పాట్నాకు మార్చారు. డిసెంబరు 2008లో, పాట్నా కోర్టు సాక్ష్యాధారాలు లేకపోవడంతో ప్రభునాథ్ సింగ్‌ను అన్ని అభియోగాల నుండి తీసివేసింది. కాగా 2012లో ప్రభునాథ్ సింగ్ నిర్దోషి అని పాట్నా హైకోర్టు సమర్థించింది. కాగా సెప్టెంబరు 1న కోర్టులో ప్రభునాథ్ సింగ్‌ను హాజరుపరచాల్సిందిగా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆ తర్వాత శిక్షాకాలంపై ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ కేసులో ప్రభునాథ్ సింగ్‌ను సుప్రీంకోర్టు దోషిగా నిర్ధారించగా, ఇతర నిందితులను నిర్దోషులుగా ప్రకటించారు. 'బీహార్ డీజీపీ, ప్రధాన కార్యదర్శి... ప్రభునాథ్ సింగ్‌ను సెప్టెంబర్ 1న కోర్టులో భౌతికంగా హాజరుపరచాలని కోర్టు వారు కోరారు' అని బాధితుడి తరపు న్యాయవాది అభయ్ కుమార్ కోర్టు వెలుపల విలేకరులతో చెప్పారు. కాగా ప్రభునాథ్ సింగ్ ప్రస్తుతం మరో హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 1995లో జనతాదళ్ మాజీ ఎమ్మెల్యే అశోక్ సింగ్ హత్య కేసులో రెండు దశాబ్దాల విచారణ తర్వాత అతను తన ఇద్దరు సోదరులతో పాటు 2017లో జీవిత ఖైదు విధించబడ్డాడు. బీహార్‌లో కాకుండా జార్ఖండ్‌లోని తటస్థ ప్రాతంలో విచారణ జరపాలని అశోక్ సింగ్ భార్య కోరారు.

ఆప్‌తో పొత్తుపై అధిష్ఠానానిదే తుది నిర్ణయం

కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్

న్యూదిల్లీ: దిల్లీ రాష్ట్రంలోని మొత్తం ఏడు స్థానాల్లో పార్టీ బలపడుతుందని అల్కా లాంబా చేసిన వ్యాఖ్యలకు, ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు నిర్ణయానికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ శుక్రవారం అన్నారు. ఏ ఎన్నికలకైనా సిద్ధం కావాలంటే పొత్తులతో సంబంధం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ బలపడాల్సిన అవసరం ఉందని దీక్షిత్ పీటీఐతో అన్నారు. 'ఏడు జిల్లాల్లోనూ మా పార్టీ కార్యకర్తలు బలోపేతం అవుతారని అల్కా లాంబా చెప్పారు. పార్టీని బలోపేతం చేస్తే సెలెక్టివ్‌గా చేయరు... రాష్ట్రమంతటా చేస్తారు. పొత్తు కుదిరితే... వారు ఏ స్థానం నుంచి పోటీ చేసినా, మేము వారికి మద్దతిస్తాము' అని దీక్షిత్ పీటీఐకి చెప్పారు. 'అన్ని జిల్లాల్లో మన పునాదిని బలోపేతం చేసుకోకపోతే రాబోయే ఎన్నికల్లో ఎలా పోరాడతాం? లేక వారికి ఎలా మద్దతునిస్తాం?' అని దీక్షిత్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధతపై సమీక్షించేందుకు దిల్లీలోని కాంగ్రెస్ నేతలు బుధవారం పార్టీ అగ్రనాయకులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ నాయకురాలు అల్కా లాంబా మాట్లాడుతూ... 'పొత్తు పెట్టుకోవాలా వద్దా అనే దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే మొత్తం ఏడు స్థానాల్లో పార్టీని సిద్ధం చేయాలని కోరారు. ఏడు స్థానాల్లోనూ సన్నద్ధమైన తర్వాత బలంగా ప్రజల్లోకి వెళ్తాం' అని వ్యాఖ్యానించారు. అయితే దిల్లీలో కాంగ్రెస్ ఒంటరిగా వెళ్లాలనుకుంటే ముంబైలో జరిగే 'ఇండియా' తదుపరి సమావేశానికి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆప్ పేర్కొంది. లంబా ప్రకటనపై ఆప్ స్పందనను దీక్షిత్ తప్పుబట్టారు. ఆప్ ప్రకటన బ్లాక్ మెయిల్ చేయడానికి లేదా వార్తల్లో నిలిచేందుకు వ్యూహంగా ఉందని దీక్షిత్ అన్నారు. 'రాజకీయంగా ఆప్ కంటే మేం చాలా భిన్నంగా ఉన్నాం. అయితే వారు తమను తాము సవరించుకుని, కాంగ్రెస్ కేంద్ర నాయకత్వ నిర్ణయానికి కట్టుబడి ఉంటే... మేము వారికి మద్దతు ఇస్తాము. పొత్తుపై కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుంది' అని దీక్షిత్ అన్నారు.

మనుగడకు భారీ రాకెట్లు అవశ్యం

బెంగళూరు: అంతరిక్ష పరిశోధనల్లో పొదుపు మంత్రంతో దూసుకెళు తున్నాగానీ భవిష్యత్తులో భారీ రాకెట్ల అవసరం ఉందని ఇస్రో మాజీ చైర్మన్ కె.శివన్ అన్నారు. చంద్రయాన్-3 దాదాపు చివరి దశకు చేరుకునే క్రమంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. భారీ సామర్థ్యం కలిగిన రాకెట్లతో పాటు పెద్ద వ్యవస్థలు అవసరం మనకు ఉందని శివన్ చెప్పారు. పొదుపు ఒక్కటే అనుసరిస్తే మనుగడ సాధించలేమన్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు అత్యంత శక్తిమంతమైన రాకెట్లు అవసరం ఉందని, ఇందుకోసం అంతరిక్ష కార్యకలాపాల్లో ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం అనుమతిచ్చిందని శివన్ తెలిపారు. త్వరలోనే అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటారని ఆశిస్తున్నానని చెప్పారు. 'గగన్‌యాన్ మిషన్‌తో భారత అంతరిక్ష ఆశయాలు మరింత ఊపందుకుంటాయన్నారు. ఆ తర్వాత అంతరిక్ష కేంద్రం నిర్మాణం, చంద్రుడిపై శాశ్వత ఆవాసం తదితరాలపై దృష్టి పెట్టవచ్చన్నారు. ఇప్పటికే అత్యంత శక్తిమంతమైన క్రయోజెనిక్ ఇంజిన్లను భారత్ తయారు చేసిందని చెప్పారు. స్పేస్ ఎక్స్ మాదిరి పునర్వినియోగ రాకెట్లకు కాదుగానీ రాకెట్లు నిట్టనిలువు ల్యాండింగ్ ప్రక్రియపై ప్రయోగాలు జరుగుతున్నాయని శివన్ చెప్పారు.

బీజేపీకి ప్రజాసమస్యలు పట్టవు: సోరెన్

గిరిదిహ్: బీజేపీ, ఏజేఎస్‌యూ పార్టీల అధికారం తప్ప ప్రజా సమస్యలపై ఏ కోశాన చిత్తశుద్ధి లేదని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విమర్శించారు. గిరిదిహ్ జిల్లాలోని డుమ్రీలో జేఎంఎం అభ్యర్థి బేబీదేవి విజయం కోసం గురువారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి సోరెన్ మాట్లాడుతూ... బీజేపీ, ఏజేఎస్‌యూ పార్టీలకు భయపెట్టడం, బెదిరింపు రాజకీయాలు మాత్రమే తెలుసునన్నారు. 'విభజించి పాలించడమే వారి పని. ప్రజలను ఒకరితో ఒకరు పోట్లాడుకునేలా చేసి తమ రాజకీయ రొట్టెలు కాల్చుకుంటున్నారు. వారికి జార్ఖండ్ ప్రజలపై ఎలాంటి చింత లేదు. వారు అధికారాన్ని మాత్రమే ప్రేమిస్తారు' అని సోరెన్ అన్నారు. జార్ఖండ్‌లో బీజేపీ-ఏజేఎస్‌యూ కూటమి 20 ఏళ్లు పాలించిందని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కూడా నడిపారన్నారు. అయితే దేశంలో అత్యంత వెనుకబడిన రాష్ట్రంగా జార్ఖండ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాలన సాగించారని చెప్పారు. ఓ క్రమపద్ధతిలో ఈ రాష్ట్రాన్ని ఖాళీ చేయడానికి వారు పనిచేశారని తెలిపారు. గిరిజన రాష్ట్రంలోని పేద ప్రజల కోసం రాష్ట్ర బకాయిలు రూ.1.36 లక్షల కోట్లు ఇవ్వాలని తాను అడగ్గా... 'మొదట వారు సాకులు చెప్పడం ప్రారంభించారు. డాక్యుమెంట్లు చూపించాక, నన్ను జైల్లో పెట్టడానికి ఈడీ, సీబీఐని వెనకేసుకొచ్చారు' అని సోరెన్ తెలిపారు. రక్షణ భూముల కుంభకోణం ఆరోపణలపై విచారణకు సంబంధించి రాంచీలోని ఫెడరల్ ఏజెన్సీ కార్యాలయంలో ఆగస్టు 14న హాజరు కావాలని సోరెన్‌కు ఈడీ గత వారం నోటీసు పంపింది. అయితే ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలకు హాజరవ్వాల్సి ఉందని చెబుతూ... ఈడీ ఎదుట సీఎం హాజరు కాలేదు. డుమ్రీ అసెంబ్లీకి సెప్టెంబర్ 5న జరగనున్న ఉపఎన్నికల్లో పోటీకి పాలక జేఎంఎంకి చెందిన బేబీ దేవి , ఏజేఎస్‌యూ పార్టీకి యశోదా దేవి, ఏఐఎంఐఎం అభ్యర్థి మౌలానా అబ్దుల్ మోబిన్ రిజ్వీ అభ్యర్థులుగా గురువారం తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.